RNI No. TELTEL . 12/48343

# మహానది

MAHANADI TELUGU DAILY

రంగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 42 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | మంగళవారం | మే | 19 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00

## బస్తర్ రూపురేఖలు మారుస్తా: షా

ఛత్తీస్‌గఢ్: ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బస్తర్ జిల్లాలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అభివృద్ధి, భద్రతకు సంబంధించి పలు కీలక ప్రకటనలు చేశారు. ఈ సందర్భంగా బస్తర్ ప్రాంత సమగ్ర అభివృద్ధి, శాంతిభద్రతలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, స్థానిక ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రధాని మోడీ నాయకత్వ ంలో దేశంలో మావోయిజాన్ని దాదాపు అంతం చేశామని అమిత్ షా అన్నారు. బస్తర్ ప్రాంత రూపురేఖలను మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను రూపొందించిందని వెల్లడించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన 70 భద్రతా క్యాంపులను ఇకపై 'సేవా కేంద్రాలు'గా మార్చబోతున్నట్లుగా ప్రకటించారు.



## ప్యాసింజర్ రైలులో..
# చెలరేగిన మంటలు
### బోగీ పూర్తిగా దహనం!

పాట్నా : బిహార్‌లోని సాసారాం రైల్వే స్టేషన్‌లో సోమవారం తెల్లవారుజామున ఒక ప్యాసింజర్ రైలులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాట్‌ఫారమ్ నంబర్ 6 పై పాట్నా వెళ్లడానికి సిద్ధంగా ఉన్న 'సాసారాం–పాట్నా ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్' జనరల్ బోగీ టాయిలెట్ భాగం నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలు, మంటలు వ్యాపించాయి. మంటలు క్షణాల్లో బోగీ అంతటా విస్తరించడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనల మధ్య ప్రాణభయంతో రైలునుంచి దిగిపోయారు. రైల్వే సిబ్బంది తక్షణమే స్పందించి మంటలు అంటుకున్న బోగీని మిగతా రైలు భాగం నుండి వేరు చేసి ప్రమాద తీవ్రతను తగ్గించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, ఆర్‌పీఎఫ్ బలగాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చాయి. ఈ ప్రమాదంలో ఒక జనరల్ బోగీ పూర్తిగా కాలి బూడిదైనప్పటికీ, సిబ్బంది సమయస్ఫూర్తి వల్ల ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రాథమికంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తుండగా, రైల్వే ఉన్నతాధికారులు దీనిపై పూర్తిస్థాయి సాంకేతిక విచారణకు ఆదేశించారు.



## మన దేశం గురించి తెలియకనే..
# ఆ విమర్శలు
### డచ్ ప్రధానికి భారత్ గట్టి కౌంటర్

- భారత్‌లో మైనారిటీల హక్కులపై డచ్ ప్రధాని ఆరోపణలు
- భారత సామాజిక వ్యవస్థ, చరిత్రను వివరిస్తూ విదేశాంగ శాఖ కౌంటర్
- అనేక మతాలు శతాబ్దాలుగా వర్ధిల్లుతున్నాయని స్పష్టం

ఢిల్లీ,:భారత్‌లో పత్రికా స్వేచ్ఛ, మైనారిటీల హక్కులపై డచ్ ప్రధానమంత్రి రోబ్ జెట్టన్ చేసిన వ్యాఖ్యలను విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. మన దేశ సామాజిక, ప్రజాస్వామ్య వ్యవస్థపై కనీస అవగాహన, తగిన సమాచారం లేకపోవడం వల్లే ఇలాంటి విమర్శలు చేశారని తిప్పికొట్టింది. ది హేగ్‌లో జరిగిన మీడియా సమావేశంలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి సిబి జార్జ్ మాట్లాడుతూ.. కేవలం అజ్ఞానం వల్లే ఇలాంటి ప్రశ్నలు, ఆరోపణలు ఎదురవుతున్నాయని స్పష్టం చేశారు.

**రోబ్ జెట్టన్ ఏమన్నారంటే.. :** ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశానికి ముందు రోబ్ జెట్టన్ భారత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో కేవలం పత్రికా స్వేచ్ఛతో పాటు మైనారిటీల హక్కులు ఒత్తిడిలో ఉన్నాయని నిరాధార ఆరోపణలు చేశారు. దీనిపై తమ ప్రభుత్వం ఆందోళన చెందుతోందని ఓవార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. ఇలాంటి అంశాలను తాము క్రమం తప్పకుండా భారత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. డచ్ ప్రధాని వ్యాఖ్యలకు భారత్ తన ప్రజాస్వామ్య బలాన్ని తెలియజేసేలా గణాంకాలతో కూడిన కౌంటరిచ్చింది. భారత్ 140 కోట్ల జనాభాతో, 5,000 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన గొప్ప వైవిధ్యభరితమైన దేశమని జార్జ్ గుర్తుచేశారు. హిందూ, బౌద్ధ, జైన, సిక్కు మతాలు ఇక్కడే పుట్టాయని తెలిపారు. అన్ని మతాలు శతాబ్దాలుగా వర్ధిల్లుతున్నాయని చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 90 శాతం కంటే ఎక్కువ మంది ఓటర్లు పాల్గొనడమే భారత ప్రజాస్వామ్య శక్తికి నిదర్శనమని పేర్కొన్నారు.



# తారెత్తిస్తున్న ఎండలు
### మరో వారం రోజులు ఇదే పరిస్థితి

హైదరాబాద్: రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. మరో వారం రోజులు గరిష్ఠఉష్ణోగ్రతలు మరింత నమోదయ్యే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణకేంద్రం హెచ్చరించింది. ఈనెల 19నుంచి 24వరకు రాష్ట్రవ్యాప్తంగా 45నుంచి 47డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొన్నది. మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం బలహీనపడింది. రానున్న రెండు, మూడు రోజుల్లో నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియన్ సముద్రంలోనిమరికొన్ని ప్రాంతాలు, నైరుతి,ఆగ్నేయ బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు,అండమాన్ సముద్రం,అండమాన్ నికోబార్ దీవుల్లోని మిగిలిన ప్రాంతాలు, తూర్పు బంగాళాఖాతంలోని కొన్ని ప్రాం తాల్లోకి ప్రవేశించడానికి అనుకూలంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. 5జిల్లాలకు రెడ్ అలర్ట్: రాష్ట్రంలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీచేసింది. మరో 16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది.రాష్ట్రంలో నిర్మల్ జిల్లా తానూర్‌లో అత్యధికంగా 45.8 డిగ్రీలు,ఆదిలాబాద్ జిల్లాథారోజ్‌లో 45.5,నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో 45.3 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది.




## కేరళలో యూడీఎఫ్ ప్రభుత్వం..
## సీఎంగా సతీశన్ ప్రమాణ
# స్వీకారం

- కేరళ నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం
- పదేళ్ల విరామం తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన యూడీఎఫ్ కూటమి

తిరువనంతపురం: కేరళలో పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికార పగ్గాలు చేపట్టింది. నేడు తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ ఆర్లేకర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సతీశన్‌తో పాటు మరో 20 మంది ఎమ్మెల్యేలు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. కొత్త మంత్రివర్గంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు రమేశ్ చెన్నితాల, కే. మురళీధరన్, ఏపీ అనిల్ కుమార్‌లకు స్థానం లభించింది. అలాగే, కేపీసీసీ చీఫ్ సన్నీ జోసెఫ్ కూడా కేబినెట్‌లో చేరారు. మిత్రపక్షాల నుంచి ఐయూఎంఎల్ సీనియర్ నేత పీకే కున్హాలికుట్టి, ఆర్ఎస్పీ నేత షిబు బేబీ జాన్, కేరళ కాంగ్రెస్ నేత మోన్స్ జోసెఫ్, కేరళ కాంగ్రెస్ (జాకబ్) నేత అనూప్ జాకబ్ వంటి ప్రముఖులు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ వేడుకకు వేలాది మంది యూడీఎఫ్ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

రాజకీయ ప్రత్యర్థికి హోం శాఖ.. సతీశన్ సంచలనం: కేరళ రాజకీయాల్లో ఓ అరుదైన పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి వీడీ సతీశన్, అత్యంత కీలకమైన హోం శాఖను తన వద్ద ఉంచుకోకుండా పార్టీలోని తన రాజకీయ ప్రత్యర్థిగా పేరున్న సీనియర్ నేత రమేశ్ చెన్నితాలకు కేటాయించారు.



## కెబిఆర్ పార్క్ చుట్టూ
## చెట్ల నరికివేతపై
# స్టే
### సుప్రీం ఆదేశాలతో నిలిచిపోనున్న ఫ్లై ఓవర్ నిర్మాణాలు

న్యూఢిల్లీ,మే18 :కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఎకో సెన్సిటివ్ జోన్ లోపల చెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టగా.. చెట్ల నరికివేతపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. సోమవారం జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ముందు ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. పర్యావరణ ప్రేమికుల తరఫున సీనియర్ కౌన్సిల్ కె. వివేక్ రెడ్డి బలమైన వాదనలు వినిపించారు. చెట్ల నరికివేత వల్ల వస్తున్న పర్యావరణ నష్టాన్ని వివరించి, ప్రభుత్వ నిర్మాణ పనులపై స్టే విధించాలని కోర్టును కోరారు. దీంతో చెట్ల నరికివేతపై స్టే ఇచ్చిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు స్టే ఆదేశాలతో ఎస్ఆర్‌డీపీ పనులు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. ప్రధానంగా కేబీఆర్ జంక్షన్ పరిసరాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణానికి భారీ ఆటంకం ఏర్పడింది.




## ఇచ్చిన హామీలను పట్టించుకోని
# రేవంత్
### తలెత్తుకోలేక పోతున్న పిసిసి చీఫ్
### మీడియా సమావేశంలో ఎంపి అర్వింద్ విమర్శలు

నిజామాబాద్,: నిజామాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారని స్థానిక ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. ఔటర్ రింగ్ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ హామీలు ఏమయ్యాయని అన్నారు. ఈ హామీలు నెరవేర్చకపో వడంతో పిసిసి చీఫ్ తలెత్తుకోలేక పోతున్నారని అన్నారు. సోమవారం నిజామాబాద్‌లో ఎంపీ అరవింద్ విలేకర్లతో మాట్లాడుతూ.. టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకే జిల్లాకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఈ జిల్లాలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తిరు గుతున్నారని ప్రశ్నించారు. నిజామాబాద్‌కు అవుటర్ రింగ్ రోడ్ ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందూరు ప్రజలను మోసం చేస్తే వారే బుద్ధి చెబుతారన్నారు. దేవుళ్లను మోసం చేసిన వాడికి ప్రజలను మోసం చేయటం లెక్క కాదని నిజామాబాద్ బీజేపీ ఎంపీ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కావని కుండ బద్దలు కొట్టారు. ఇప్పటి వరకు నిజామాబాద్ నగరంలో 25 శాతం డ్రైనేజీ పనులు కూడా పూర్తి కాలేదన్నారు.

## గోవులను తరలిస్తున్న వారిపై
# చర్యలు తీసుకోండి
### డిజిపి ఆనంద్‌కు ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ



హైదరాబాద్,మే18 : తెలంగాణలో గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎమ్మెల్యే బహిరంగ లేఖ రాశారు. శనివారం రాత్రి గోవులతో వెళ్తున్న లారీని గో రక్షక్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారని.. దీంతో ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడకు చేరుకొని ఆ లారీని తీసుకెళ్లడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని.. హిందువైనా, ఎంఐఎం నాయకులైనా ఒకే విధంగా చూడాలని అన్నారు. గోవుల అక్రమ రవాణా చేస్తూ బహిరంగంగా తిరుగుతున్న వారిపై వెంటనే కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. పోలీసులు.. రాజకీయ ఒత్తిడికి లోనుకాకుండా పని చేయాలని తెలిపారు. హిందువులపై మాత్రమే చర్యలు తీసుకుంటే ప్రజల్లో అనుమానాలు వస్తాయన్నారు. గోమాతను కాపాడాలని చెప్పే ప్రభుత్వం.. అక్రమ రవాణాను ఎందుకు ఆపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఎవరైనా చట్టం ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ డీజీపీ వెంటనే ఈ విషయంపై స్పందించి చర్యలు తీసుకోవాలని రాజాసింగ్ లేఖలో స్పష్టం చేశారు.



ఒకే కుటుంబంలో ఐదుగురి మృతి

## తమిళనాడులో ఘోర రోడ్డు
# ప్రమాదం

మధురై : తమిళనాడులోని మధురై సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకోవడంతో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధురైలోని అన్నా నగర్‌కు చెందిన ప్రకాశ్, అతని బంధువు రమేశ్‌తో పాటు మరో ముగ్గురు మహిళలు కారులో తిరుచిరాపల్లిలోని ప్రముఖ సమయపురం మరియమ్మన్ ఆలయానికి వెళ్లారు. ఆదివారం సాయంత్రం దైవ దర్శనం ముగించుకుని తిరిగి మధురైకి బయలుదేరారు. మేలూరు సమీపంలోని అయ్యపట్టి వద్ద హైవేపై వీరి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బ్యారియర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జయి, అందులో ప్రయాణిస్తున్న ఐదుగురూ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న కొట్టంపట్టి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం మేలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతివేగం, డ్రైవర్ నిద్రమత్తు లేదా వాహనంలో సాంకేతిక లోపం వంటి కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మరణించడంతో వారి బంధువుల రోదనలు మిన్నంటాయి.

# బండి సంజయ్ రాజీనామా కోరుతూ ఆందోళన
### సిరిసిల్లలో బిఆర్ఎస్, బిజెపిల ఘర్షణతో ఉద్రిక్తత



రాజన్న సిరిసిల్ల,మే18 : సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉద్రిక్తత నెలకొంది. బండి భగీరథ్ పోక్సో కేసులో అరెస్టయిన నేపథ్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని పాత బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలపై బీజేపీ శ్రేణులు దాడికి దిగాయి. ఈ ఘటనలో పలువురు బీఆర్ఎస్ నేతలు గాయపడ్డారు. బీజేపీ శ్రేణులు దాడికి పాల్పడినప్పటికీ బీఆర్ఎస్ నేతలు నిరసనలు ఆపలేదు. బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ క్రమంలో ఉద్రిక్తతలు తలెత్తడంతో జిల్లా ఎస్పీ మహేశ్ బి గితే, డీఎస్పీ నాగేంద్రచారి బీజేపీ నేతలను అడ్డుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక బీఆర్ఎస్ నేతలను సముదాయించి పంపించారు.

# మజిలీస్ పార్టీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**-వీహెచ్ పీ ధర్మాచార్య సంపర్క ప్రముక్ పగుడాకుల బాలస్వామి**
**-గోవులను అక్రమంగా తరలింపుపై చోద్యం చూస్తున్న పోలీసులు**
**-పోలీసులను భయబ్రాంతులకు గురిచేస్తున్న ఎంఐఎం నేతలు**
**-"కాంగ్రెస్ అంటే ముస్లిం.. ముస్లిం అంటే కాంగ్రెస్" మాటను నిలబెట్టుకుంటున్న రేవంత్ ప్రభుత్వం**

**హైదరాబాద్, మహానది న్యూస్, మే 18**:తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా భాగ్యనగర్ లో గో హత్యలు విపరీతంగా పెరుగుతున్నాయని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కారణమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ధర్మాచార్య సంపర్క ప్రముక్ పగడాకుల బాలస్వామి ఆరోపించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు కక్కుర్తి పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఎంఐఎం ఆదేశాలకు తలోగ్గిందని విమర్శించారు. ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు నడిరోడ్డుపై వచ్చి పోలీసులపైనే దౌర్జన్యం చేస్తున్నప్పటికీ, ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అత్యంత హేయమని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం బాలస్వామి ఓ ప్రకటన విడుదల చేశారు. స్వయంగా రైతు బిడ్డ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిజిపి సి వి ఆనంద్ గోరక్షణలో ప్రత్యేక చొరవ చూపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యాధునిక గోషాలలు నిర్మిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి..మరి గోవులను విపరీతంగా కోతకు తరలిస్తుంటే ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు." ముస్లిం అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే ముస్లిం" అనే మాటను నిలబెట్టుకోవడంలో రేవంత్ రెడ్డి సఫలీకృతుడు అవుతున్నాడని ఎద్దేవా చేశారు. ముస్లింల మెప్పుకోసం హిందువుల గొంతు కోస్తారా..? అని ప్రశ్నించారు. హిందువుల మనోభావాలు తాకట్టుపెట్టి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటు అన్నారు. గోరక్ష చట్టాలు అమలు చేయడంలో పోలిస్ యంత్రాంగం ఘోరంగా విఫలమైందని బాలస్వామి ఆరోపించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకే సవాల్ సవాల్ చేస్తూ.. భయబ్రాంతులను సృష్టిస్తున్న



ఎంఐఎం నేతలను కట్టడి చేయడంలో చేతులు ముడుచుకుంటున్నారని విమర్శించారు. బక్రీద్ దగ్గర పడుతున్న కొద్దీ వేలాది గోవులు భాగ్యనగర్ పాతబస్తీకి చేరుకున్నాయని, వాటిని కాపాడి గోశాలలకు తరలించాలని పోలీసులను డిమాండ్ చేశారు. నడిరోడ్డుపై పోలీసులను ఎంఐఎం నేతలు భయపెడుతుంటే కూడా స్పందించకపోవడం దారుణం అన్నారు. పైగా గోరక్ష చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న హిందూ సంస్థల నాయకులపై కేసులు పెట్టడం అత్యంత దారుణం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ సంస్థల నాయకులను భయపెట్టి గోవుల హంతకులకు మద్దతిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవడం తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు పేరుకు మాత్రమే ఉన్నాయని, ఎక్కడ కూడా ఆవులను పట్టుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం స్పందించి అక్కడక్కడ డంపు చేసిన గోవులను వెంబడే విడుదల చేసి గోషాలకు తరలించాలని బాలస్వామి డిమాండ్ చేశారు.


## విద్యార్థులకు, తల్లిదండ్రులకు సన్మానం



**బయ్యారం,మహానది న్యూస్,మే 18**: బడిబాట లో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశం లో ప్రధానోపాధ్యాయులు ఏం.ధనంజయ మాట్లాడుతూ అన్ని వేళలా అదృష్టం కలిసి రాకున్నా కఠోర శ్రమ, క్రమశిక్షణ ఎప్పుడూ విజయాన్నే చేకూర్చి పెడతయని అన్నారు. విద్యార్థులకు జీవితంలో రాబోయే కాలం అత్యంత కీలకమని, క్రమశిక్షణ తో కష్టపడితేనే బంగారు భవష్యత్తుకు పునాదులు వేసుకోగలరని తెలిపారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు ఎలా చదువుతున్నారో గమనించాలని, అధ్యాపకుల తో చర్చించి వారిని ఎప్పటికప్పుడు కంటికి రెప్పలా కాపాడుతూ కార్యోన్ముఖులను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఐర్ప లక్ష్మీ నారాయణ, ఎం.వీ.రామేశ్వర్ రావు, బానోత్ రవీందర్, బెల్లి లక్ష్మయ్య, దేగం శ్రీనివాస రావు, విజయ,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో సంక్షేమ కన్నా సంక్షోభం మిన్న

దేశ అభివృద్ధి మానవ వనరుల సమర్థ అభివృద్ధిపై ఆధారపడి ఉంటుంది. ఈ ప్రక్రియలో విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తాయి. విద్య, పరిశోధన, ఆవిష్కరణల ద్వారా సమాజాన్ని ముందుకు నడిపించే బాధ్యత వాటిపై ఉంటుంది. అయితే ఇటీవలి కాలంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న అధ్యాపకుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది.దేశవ్యాప్తంగా రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో శాశ్వత అధ్యాపక నియామకాలు దాదాపు నిలిచిపోయాయి. దీంతో బోధన, పరిశోధన నాణ్యత దెబ్బతింటోంది. కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీలపై అధికంగా ఆధారపడటం విద్యా ప్రమాణాలను తగ్గిస్తోంది. ఫలితంగా నాక్ గ్రేడింగ్, జాతీయ-అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు వెనుకబడుతున్నాయి.అధ్యాపకుల సంక్షేమం కూడా తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. పాత పింఛన్ విధానం రద్దు అనంతరం కొత్త పింఛన్ విధానం సమర్థంగా అమలు కావడం లేదు. రిటైర్మెంట్ ప్రయోజనాలు ఆలస్యంగా చెల్లించబడుతున్నాయి. ఆరోగ్య పరిరక్షణలో స్పష్టమైన విధానం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో అధ్యాపకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పోలిస్తే విశ్వవిద్యాలయ అధ్యాపకులకు భద్రత తక్కువగా ఉంది. క్యాంపస్‌లోని నివాస సదుపాయాలు పాతబడి, నిర్వహణ లోపంతో అనేక మంది బయట అద్దె ఇళ్లలో నివసిస్తున్నారు. డీఏ వంటి భత్యాలు కూడా కొన్నిచోట్ల సమయానికి అందడం లేదు. ఫ్యాకల్టీ కొరత కారణంగా ప్రస్తుతం పనిచేస్తున్న అధ్యాపకులపై అధిక పనిభారం పడుతోంది. బోధనతో పాటు పరిపాలనా బాధ్యతలు నిర్వర్తించాల్సి రావడంతో పరిశోధన, ప్రాజెక్టులు, ఆవిష్కరణలు వెనుకబడుతున్నాయి. యువ అధ్యాపకుల నియామకం లేకపోతే ఈ పరిస్థితి మరింత విషమించే అవకాశం ఉంది. పరిపాలనలో పారదర్శకత లోపించడం మరో ప్రధాన సమస్య. సీనియారిటీని పక్కనబెట్టి



నియామకాలు చేయడం, అన్యాయ నిర్ణయాలు తీసుకోవడం అకాడమిక్ వాతావరణాన్ని దెబ్బతీస్తున్నాయి. సమానత్వం, న్యాయం వంటి రాజ్యాంగ సూత్రాలను పాటించాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు పలుమార్లు స్పష్టం చేసింది. మొత్తంగా చూస్తే ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పతనం కేవలం విద్యా వ్యవస్థకే కాకుండా దేశ భవిష్యత్తుకూ ముప్పుగా మారుతోంది. కాబట్టి తక్షణమే శాశ్వత అధ్యాపక నియామకాలు చేపట్టడం, పింఛన్ భద్రత కల్పించడం, రిటైర్మెంట్ ప్రయోజనాలను సమయానికి చెల్లించడం, ఆరోగ్య సదుపాయాలు అందించడం, పారదర్శక పరిపాలన అమలు చేయడం అత్యవసరం. ఈ చర్యల ద్వారానే ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు తమ పూర్వ వైభవాన్ని తిరిగి పొందగలవు.ప్రొఫెసర్ చెన్నప్ప దాసరిసీనియర్ ప్రొఫెసర్, వాణిజ్య విభాగం, ఉస్మానియా యూనివర్సిటీ

## కేంద్రమంత్రి పిఆర్ ఓ గా రాజ్ కుమార్




**హైదరాబాద్, మహానది న్యూస్,మే 18:** రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఏ) జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సామాజికన్యాయం, సాధికారత శాఖ మంత్రి రాందాస్ ఆత్వలే రెండు తెలుగు రాష్ట్రాల (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) ప్రజా సంబంధాల అధికారి (పీఆర్ఓ)గా టి.రాజ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పార్టీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇంచార్జీ పేరం శివనాగేశ్వర రావు గౌడ్ చేతుల మీదుగా రాజ్ కుమార్ నియామకపు పత్రాన్ని అందుకున్నారు. పార్టీ అధినేత, కేంద్రమంత్రి ఆదేశాల మేరకు రాజ్ కుమార్ ను నియమించినట్లు శివనాగేశ్వర రావు గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా కాచిగూడలో రాజ్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి ఆదేశాల మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పార్టీ అభివృద్ధి తో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకువెళ్ళి పార్టీకి మంచి పేరు తీసుకువచ్చే విధంగా కృషిచేస్తానని తెలిపారు. ప్రజలకు, పార్టీకి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారారం కోసం తనవంతుగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# కెమిస్ట్ ల సమస్యలను పార్లమెంట్ లో ప్రస్తావించాలి

**-ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కి విజ్ఞప్తి చేసిన కెమిస్ట్ లు**

**హైదరాబాద్, మహానది న్యూస్,మే 18:** దేశ వ్యాప్తంగా కెమిస్ట్ లు ఎదుర్కొంటున్న సమస్యలను పార్లమెంట్ లో ప్రస్తావించి పరిష్కరించే విధంగా చూడాలని కోరుతూ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అధ్యక్షుడు డాక్టర్ ఫీసులాల్ జైన్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సోమవారం హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని కలిసి వినతి పత్రం అందజేశారు. కెమిస్ట్ ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ... ఈ నెల 20వ తేదీన ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ఇచ్చిన పిలుపు మేరకు దేశ వ్యాప్త మెడికల్ షాపుల బంద్ కు మద్దతు ఇవ్వాలని వారు ఎంపీ అసదుద్దీన్ ను కోరారు. ఆన్ లైన్ ద్వారా మెడిసిన్ విక్రయాలు, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను



వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నకిలీ, నాణ్యత లేని మందుల విక్రయాలను పూర్తిగా అరికట్టాలని, ఇది ప్రజారోగ్య భద్రతకు అత్యంత అవసరమని అన్నారు.

## జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు

నిర్మల్: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు స్థానిక ఎన్.టీ.ఆర్ మినీ స్టేడియంలో నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో జిల్లాలోని వివిధ మండలాల నుండి సుమారు 60 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడా ప్రతిభను గుర్తించి, ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీ.వై.ఎ స్.ఓ శ్రీకాంత్ రెడ్డి, ఎస్.జి.ఎఫ్ సెక్రటరీ రవీందర్ గౌడ్, పీడీ రమణారావ్,పీఈటీ భోజన్న,పీడీలు లక్ష్మణ్,సత్తయ్య, ఎం. సత్య నారాయణ, కె. శ్రీనివాస్, ఆర్. వెన్నెల, శారదా, సంజు రాథోడ్, కవిత, వంశీధర్, నచ్చేందర్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మానియా పేరుతో కల్తీ బిస్కెట్లు..
## ప్రజల ప్రాణాలతో చెలగాటం

హైదరాబాద్ : అంబర్‌పేట్ ప్రాంతంలో నకిలీ (కల్తీ) ఉస్మానియా బిస్కెట్లు తయారు చేస్తున్న ఓ ఫ్యాక్టరీ పై పోలీసులు, ఆహార భద్రత అధికారులతో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. బిస్కెట్లకు ఆకర్షణీయ మైన రంగు, రుచి కలిగించేందుకు నిషేధిత, ప్రాణాంతక రసాయనాల ను వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా, తక్కువ ఖర్చుతో ఉత్పత్తి పెంచేందుకు కుళ్ళిపోయిన, పాడైన గుడ్లను ఉపయోగిస్తున్నట్లు ఆధారాలతో సహా గుర్తించారు. ఫ్యాక్టరీలో కనీస పరిశుభ్రత ప్రమాణాలు పాటించకపోవడం, ఈగలు ముసురుతున్న మురికి వాతావరణంలోనే తయారీ కొనసాగిస్తున్నారు. ఈ పరిస్థితులు ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగించే అవకాశముందని అధికారులు హెచ్చరించారు. ఈ ఘటన పై కేసునమోదు చేసి, ఫ్యాక్టరీ యజమాని పై కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. స్వాధీనం చేసుకున్న ముడి సరుకులను ప్రయోగశా లకు పంపినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జాతీయ వేదికపై మరోసారి
## విరాజిల్లిన నిర్మల్ జిల్లా ఖ్యాతి

### జిల్లాకు రెండు ప్రతిష్టాత్మక స్కాచ్ అవార్డులు




జాతీయ వేదికపై మరోసారి నిర్మల్ జిల్లా ఖ్యాతి ప్రజరిల్లింది. జిల్లాకు రెండు ప్రతిష్టాత్మక స్కాచ్ అవార్డులు ద దక్కాయి. వివిధ జిల్లా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన వినూత్న కార్యక్రమాలకు గాను స్కాచ్ అవార్డ్ లు నిర్మల్ జిల్లా సొంతం చేసుకుంది. ఢిల్లీ వేదికగా జరిగిన ఈ అవార్డులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, సంబంధిత శాఖలతో కలిసి స్వీకరించారు. నిర్మల్ జిల్లాకే తలమాణికమైన కొయ్య బొమ్మల పరిరక్షణ, చారిత్రాత్మక వారసత్వాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పంతో.. కొయ్య బొమ్మల తయారీకి ఉపయోగించే పొనికి కర్రల పెంపకం కోసం ఏర్పాటు చేసిన పొనికి వనానికి గాను లభించిన జాతీయస్థాయి స్కాచ్ అవార్డును జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మితో కలిసి స్వీకరించారు. జిల్లాలో అమ్మరక్షిత అనే వినూత్న కార్యక్రమం ద్వారా మాతృత్వ మరణాలు తగ్గించినందుకు లభించిన మరో స్కాచ్ అవార్డును వైద్యరోగ్య శాఖ అధికారి రాజేందర్ తో కలిసి కలెక్టర్ స్వీకరించారు. అవార్డు స్వీకరణ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, మరోసారి జిల్లాకు జాతీయ వేదికలో అవార్డు రావడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. అధికారుల ఉత్తమ పనితీరుతో ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేసి, అవార్డు సాధనలో కృషి చేసిన అధికారులు అందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆందోళనకరంగా ద్రవ్యోల్బణం



ఢిల్లీ:పశ్చిమాసియా సంక్షోభం, ముడి చమురు ధరలు, ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు.. ఇలా అనేక అంశాలు దేశ ఆర్థిక ప్రగతికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ధరల పెరుగుదల, చమురు అలభ్యత, రూపాయి మారకం విలువ పెరగడం వెరసి భారత జిడిపిపై తీవ్ర ప్రభావం చూపుతోంద. ద్రవ్యోల్బణానికి కూడా కారణమవుతోంది. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు ఇప్పట్లో సద్దుమణిగేలా లేవు. దీంతో ఇధంన లభ్యత ఎలా ఉంటుందో తెలియదు. ధరలు పెరగడం మాట ఎలా ఉన్నా అభ్యత అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ట్రంప్, ఇరాన్ పట్టుదలతో ఈ సంక్షోభం ఇప్పట్లో చల్లారేలా లేదు. ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధి అంచనాలను అమెరికా బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ మరోసారి తగ్గించింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. భారత ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. మిడిల్ ఈస్ట్ నుంచి పెద్ద ఎత్తునే వస్తున్నది. గత నెల 28 నుంచి ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రారంభించాయి. అప్పట్నుంచి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అమెరికాకు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలైన కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఆయా దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నది. దీంతో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి నిలిచిపోయింది. పైగా మిడిల్ ఈస్ట్ నుంచి భారత్, చైనా సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హొర్ముజ్ జలసంధిని కూడా ఇరాన్ మూసేసింది. ఈ పరిణామం ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో ఆయా పెట్రో ఉత్పత్తుల ధరలూ పెరిగాయి. గ్యాస్ కొరత కూడా కనిపిస్తుండగా, దేశవ్యాప్తంగా చాలా హోటళ్లు, ఇతర గ్యాస్ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమలు మూతబడుతున్నదీ చూస్తూనే ఉన్నాం. ఎరువుల తయారీ కుంటుబడి వ్యవసాయ రంగం సైతం ప్రభావితం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి దేశ ఆర్థిక వృద్ధిరేటు 5.9 శాతాన్ని మించి ఉండబోదని గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా అభిప్రాయపడింది. 2026లో దేశ జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని గతంలో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. అయితే ఈ నెల 13న దీన్ని 6.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు 5.9 శాతానికి కుదించింది. కేవలం 11 రోజుల్లోనే అర శాతానికి పైగా కోత పెట్టడం గమనార్హం. దీని వెనుక మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే కారణంగా ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఇక రవాణా రంగంపైనా భారం పడుతుండగా.. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో ఆయా వస్తూత్పత్తులన్నింటి ధరలూ ఎగబాకి ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ఇది మరింత ముదిరితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాబోయే ద్రవ్య సమీక్షల్లో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదు. దీంతో వడ్డీరేట్లు పెరుగడం ఖాయమనే మెజారిటీ విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే రుణ లభ్యత క్షీణించి అన్ని రంగాల్లో కార్యకలాపాలు మందగిస్తాయి. మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ముడి చమురు దిగుమతుల్లో ఏర్పడిన అంతరాయం.. దేశంలో అన్నింటి ధరల్ని ఎగదోయగలదని గోల్డ్‌మన్ సాచ్స్ హెచ్చరిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ద్రవ్యోల్బణం 4.6 శాతానికి పెరుగవచ్చని అంచనా వేస్తున్నది. గతంలో ఇది 3.9 శాతంగానే ఉండటం గమనార్హం.

# హైదరాబాద్‌లో ఇంద్ర భవనాలు..

హైదరాబాద్ : రియల్ ఎస్టేట్ రంగం నయా ట్రెండ్ క్రియేట్ చేస్తోంది. అందులోనూ హైదరాబాద్ అంతర్జాతీయ హంగులతో అత్యాధునిక నిర్మాణాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. మొన్నటి వరకు 3500 చదరపు అడుగుల్లో నిర్మించే డబుల్, ట్రిపుల్ బెడ్ రూం ఫ్లాట్లనే విశాలమైనవిగా భావించేవారు. కానీ ఇప్పుడు 5వేల నుంచి 16వేల చదరపు అడుగులతో ఐదు, ఆరు బీహెచ్‌కే లగ్జరీ ఫ్లాట్‌లు నిర్మిస్తుండటం విశేషం. దేశంలోనే తొలిసారిగా ఇలాంటి ఫ్లాట్ల నిర్మాణానికి మన భాగ్యనగరం వేదికవుతుందని రియల్ రంగ నిపుణులు చెబుతున్నారు. నానక్ రాంగూడ, ఖాజాగూడ, రాయదుర్గం, మాదాపూర్, కోకాపేట, పుప్పాల గూడ, జూబ్లీహిల్స్, కొంపల్లి ప్రాంతాల్లో ఆకాశాన్ని తాకే భవనాల్లో ఆ తరహా ఫ్లాట్‌లు వస్తున్నట్లు తెలియజేస్తున్నారు. ఆహ్లాదకరంగా పడక గదులు..: ఈ ఫ్లాట్‌లలో 1500 నుంచి 2500 ఎస్ఎఫ్‌టీ వరకు మాస్టర్ బెడ్ రూమ్స్‌ను నిర్మిస్తున్నారు. వాటిలో ఆధునిక బెడ్స్‌తో పాటు సౌకర్యవంతమైన ఫర్నీచర్, లాంజ్, గదికి అలంకారాన్నిచ్చే షాండ్లియర్స్, స్కోన్సు, పరదాలు ఉంటున్నాయి. మనసుకు ప్రశాంతత, సుఖమైన నిద్ర వచ్చేలా అత్యాధునిక పరుపులు, మూడ్‌కు తగినట్లు మారే లైట్లు, ఇంటిగ్రేటెడ్ బెడ్ సైడ్ లైట్లు, సహజ వెలుతురు వచ్చేలా కిటికీలు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. అందులోనే టీవీ, ఇన్ బిల్ట్ సౌండ్ సిస్టమ్స్ ఉంటున్నాయి. మాస్టర్ బెడ్ రూంలో 600 చదరపు అడుగులకుపైగా విశాలమైన స్నానాల గదులకు చోటు కల్పిస్తున్నారు. అందులో అడుగు పెట్టగానే డబ్ల్యూఐసీ (వాక్ ఇన్ క్లోసెట్) స్వాగతం పలుకుతుంది. దానిలోంచి స్నానాల గదిలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. అందులో బాత్ టబ్, షవర్ విభాగం(అద్దాల గది)లో వివిధ రకాలుగా నీటి చినుకులు పడే సౌకర్యం కల్పిస్తున్నారు.

అత్యాధునిక వసతులు..: లగ్జరీ ఫ్లాట్‌లలో భారీ డైనింగ్, లివింగ్, బెడ్ రూమ్‌లతోపాటు పార్టీ ఏరియా, హోం థియేటర్లు, సిటింగ్ రూమ్స్, మీటింగ్ రూం, పెద్ద పెద్ద బాల్కనీలు ఏర్పాటు చేస్తున్నారు. ఐదు, ఆరు పడక గదులు, విశాలమైన లివింగ్ రూమ్, 10 నుంచి 20 మంది వరకు భోజనాలు చేసేలా టేబుల్స్, కుర్చీలతో డైనింగ్ హాల్, భారీ ఓపెన్ కిచెన్, పూజ గది, జిమ్, హోం ఆఫీస్, ఇంటికి వచ్చే బంధువులు, స్నేహితులకు గదులు ఇలా అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నారు. ఫ్లాట్‌లోనే ఒక మూల ఏర్పాటు చేసే హోం థియేటర్లు, ఆధునిక ప్రొజెక్టర్లు, కంటికి సౌకర్యవంతమైన తెరలు, 10 నుంచి 20 మంది వీక్షించేలా సిట్టింగ్, సౌండ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు. ఇళ్లలో పనిచేసుకునేందుకు వీలుగా హోం ఆఫీసులకు చోటు కల్పిస్తున్నారు. పార్టీ ఏరియాలో చిన్న పార్టీలతో సమావేశాలు, శుభకార్యాలు చేసుకునేలా ఏర్పాట్లుచేస్తున్నారు. అదే విధంగా పని మనుషులకు సైతం ఇందులోనే ప్రత్యేక గదులను ఏర్పాటు చేస్తున్నారు. ఓపెన్ కిచెన్లు, పొగ విస్తరించకుండా చేసే కొత్త రకం చిమ్నీలను ఏర్పాటు చేస్తున్నారు. పెంపుడు జంతువులకూ ప్రత్యేక గదులు నిర్మిస్తున్నారు. అపార్ట్‌మెంట్ వాసులంతా వినియోగించుకునేలా క్లబ్ హౌస్, ఇండోర్ స్టేడియం, క్రీడా వసతులు, స్విమ్మింగ్ పూల్స్, చిన్నారులకు వాటర్ గేమ్స్‌కు అవసరమైన హంగులు సమకూరుస్తున్నారు. ఐటీ సంస్థల్లో ఉన్నతోద్యోగులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు వీటిని సొంతం చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారని స్థిరాస్తి సంస్థల ప్రతినిధులు తెలియజేస్తున్నారు.

# సంపాదకీయం

## గ్రామాల అభివృద్ధికి దృష్టి సారించాలి !

రైజింగ్ తెలంగాణ, ట్రీ మిలియన్ ఎకానమీ...ఇవన్నీ వినడానికి బాగానే ఉన్నా..ఆచరణలో పట్టుదల ముఖ్యం. ఎపిలో స్వర్ణగ్రామం, స్వర్ వార్డులు అంటూ కొత్త పేర్లతో ఊదరగొడుతున్నారు. గ్రామాలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. ఎంతసేపు పల్లెలను విస్మరించి, పట్టణాలకే పెద్దపీట వేయడం సరికాదు. గ్రామాల అవసరాలను గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. ఫ్యూచర్ సిటీ, దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. గత రెండేళ్లుగా గ్రామాలు కునారిల్లాయి. కనీస వసతులు లేవు. గ్రామాల్లో అత్యధిక శాతం అధికార కాంగ్రెస్ ఆధిపత్యంలోనే ఉన్నాయి. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ది విషయంలో అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. గ్రామాల్లో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కరించలేనివేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్యం వట్టి సమస్యలపై ఇరు రాష్ట్రాల సిఎంలు శ్రమించాలి. ఉచిత పథకాలు పెరిగినా కొద్దీ గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడుతోంది. పనిచేసే కూలీలు దొరక్క రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి ప్రజలు బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు భాగస్వాములను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను అభివృద్ధి చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. ప్రభుత్వంపై ఆశతో ప్రజలు ఉన్నారని గుర్తించాలి. ఏదో చేస్తారన్న నమ్మకం ఉంది. ఇందిరమ్మ ఇళ్లు కావచ్చు, ఇతర అభివృద్ధికావచ్చు గ్రమాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలి. ప్రపంచ చిత్రపటంలో తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యయసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే రాజధానులపై ఒత్తిడి తగ్గుతంది. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పాటు గ్రామాలు పురోగమిస్తాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఉజ్వల తెలంగాణ నిర్మాణానికి పూనుకుంటే అది దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి దోహదపడగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధికి దోహదపడేలా చేయాలి. అప్పుడే తెలంగాన కల సాకారం కాగలదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. వ్యవసాయ పంటల కొనుగోళ్లను సజావుగా సాగేలా చూడాలి. పంటల విధానంలో మార్పులు రావాలి.

# చమురు మంటలు.. సామాన్యులే సమిధలు!





ఆకస్మికంగా తలెత్తిన చమురు సంక్షోభంతో భారత్ అల్లాడుతోంది. పెట్రోలు బంకుల్లో కొరత కనిపిస్తోంది. భయాందోళనలతో ప్రజలు ఎక్కువెక్కువగా కొనుగోలు చేస్తుండటంతో నిల్వలు ఖాళీ అవుతున్నాయి. కొన్ని పంపుల దగ్గర భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి. క్యాబ్‌లు, ఆటోవాలాలు ట్రిప్పులు రద్దు చేసుకుంటున్నారు. వంటగ్యాస్ సమస్యతో హోటళ్లు మూతపడుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధం మన దేశంలో సామాన్య జనజీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఇంధన అందుబాటుకు సంబంధించి దేశవ్యాప్తంగా నెలకొన్న గందరగోళానికి మూలాలు ఫిబ్రవరి చివర్లోనే పడ్డాయి. ఆపరేషన్ ఎపిక్‌ఫ్యూరీలో భాగంగా అమెరికా-ఇజ్రాయెల్‌లు ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన దాడుల్లో సుప్రీం నేత ఖమేనీ మరణించడంతో ప్రతీకార జ్వాలలు ఎగసిపడ్డాయి. కీలకమైన చమురు మౌలిక సదుపాయాలపై ఇరాన్ డ్రోన్‌లు, క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో సౌదీ అరామ్‌కోకు చెందిన రస్‌తానూరా రిఫైనరీ తీవ్రంగా దెబ్బతినడంతో అది పూర్తిగా మూతపడింది.

యూఏఈకి చెందిన అడ్నాక్ పుజైరా కార్యకలాపాలను 30శాతందాకా తగ్గించింది. ఖతార్‌లోని రస్‌లఫాన్ ఎల్ఎన్‌జీ కేంద్రం ఉత్పత్తిని నిలిపివేసింది. ఇరాక్ ఎగుమతులు రోజుకు 15లక్షల బ్యారెళ్లకు పడిపోయాయి. భద్రతాపరమైన భయాలతో కువైట్ చమురు క్షేత్రాలు నిలిచిపోయాయి. మునుపెన్నడూ లేనిరీతిలో ముప్పు ఎదుర్కొంటున్న గల్ఫ్ ఉత్పత్తిదారులు ప్లాంట్లను మూసివేయడమో, ఉత్పత్తిని బాగా తగ్గించడమో చేస్తున్నారు.

ఇండియాకు ఇక్కట్లు :అమెరికా, ఇజ్రాయెల్‌లపై ఒత్తిడి పెంచేందుకు హర్మూజ్ జలసంధిని ఇరాన్ ఒక భౌగోళిక ఆయుధంగా మార్చి ప్రయోగించింది. ఈ ఇరుకైన మార్గం ద్వారా ప్రపంచ చమురులో 20శాతం చమురుతోపాటు, భారీస్థాయిలో ద్రవీకృత సహజ వాయువు రవాణా జరుగుతుంది. అయితే, ఈ మార్గంలో రోజుకు డజన్లకొద్దీ సాగే ట్యాంకర్ల రాకపోకలు దాదాపు సున్నాకు పడిపోయినట్లు ఉపగ్రహ చిత్రాలు చూపుతున్నాయి. 150కి పైగా నౌకలు తీరానికి దూరంగా లంగరు వేసి ఉన్నాయి. ఈ మొత్తం పరిణామంలో అసలైన సమస్య బీమా కంపెనీల నుంచే ఎదురైంది. 90శాతం సముద్రయాన నౌకలకు ప్రాతినిధ్యం వహించే ఏడు ప్రధాన సంస్థలు యుద్ధ ప్రమాద రద్దు నోటీసులను జారీ చేశాయి. బీమా లేకపోతే బ్యాంకులు రుణాలు ఇవ్వవు. ఓడరేవులు ఓడలను నిలపడానికి నిరాకరిస్తాయి. యజమానులు సరకులను పక్కనపెడతారు. ఒకవేళ ఆఫ్రికాలోని కేప్ ఆఫ్ గుడ్‌హోప్ చుట్టూ తిరిగివచ్చేలా మార్గాన్ని మళ్లిస్తే, పదిహేను రోజులదాకా అదనపు సమయం పడుతుంది. ఇంధన ఖర్చులు అదనంగా లక్షల డాలర్లవుతాయి. దీనంతటి వల్ల యుద్ధ ప్రమాద ప్రీమియంలు రెట్టింపు లేదా మూడురెట్లు పెరిగిపోయాయి. కనిపించని దిగ్బంధనం మందుపాతరలు, యుద్ధనౌకలకన్నా ప్రమాదకరంగా తయారైంది. ఈ పరిణామాలకు ప్రతిస్పందనగా ప్రపంచ చమురు మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. ప్రధాన ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ గణనీయంగా పెరిగింది.

ఈ పరిణామాలతో ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారుగా ఉన్న ఇండియా తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. తన అవసరాలలో 85శాతందాకా విదేశీ ముడిచమురుపైనే ఆధారపడి ఉంది. ఇందులో 35నుంచి 50శాతం ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్‌ల నుంచి హర్మూజ్ మార్గం ద్వారా వస్తుంది. వంటకు వాడే ఎల్పీజీలో సుమారు 80శాతం, ఎల్ఎన్‌జీలో సగం ఇదే మార్గంగుండా వస్తాయి. వ్యూహాత్మక నిల్వలు రెండు నెలల వరకు ఆసరా ఇస్తాయి. నిల్వ, రవాణాలో సుమారు 10కోట్ల బ్యారెళ్లు ఉన్నాయి. కానీ, భయాందోళనలు ప్రణాళికలన్నింటినీ దెబ్బతీశాయి. ఇండియన్ ఆయిల్, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థలు రష్యా, అమెరికా,బ్రెజిల్, పశ్చిమాఫ్రికాసరఫరాల కోసం పోటీపడు తున్నాయి. అమెరికా ఆంక్షల నుంచి మినహాయింపులు ఇవ్వడంతో రష్యా చమురు రాయితీపై వస్తోంది. ఇది హర్మూజ్‌యేతర మార్గాల ద్వారా వస్తూ 40శాతం డిమాండ్‌ను తీరుస్తోంది. అయినప్పటికీ గల్ఫ్ ముడి చమురు, ఎల్ఎన్‌జీకి పూర్తి ప్రత్యామ్నాయంగా మారలేకపోతోంది. క్షేత్రస్థాయిలో ఈ సంక్షోభం వేగంగా విజృంభిస్తోంది. ప్రజలు భయాందోళనలతో చమురును కొనుగోలు చేస్తుండటంతో బంకులు మూతపడుతున్నాయి. కుటుంబాలు ప్రత్యామ్నాయాల కోసం వెదుకుతున్నాయి. గ్రామాలకు మార్కెట్లతో సంబంధాలు తెగిపోతున్నాయి. పట్టణాల్లో ఆర్థిక కార్యకలాపాలు మందగిస్తున్నాయి. నమ్మకమైన రవాణా లేకపోవడంతో నగరాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. పాఠశాలలు ఆలస్యమవుతున్నాయి. కార్యాలయాలు ఖాళీ అవుతున్నాయి. ఆసుపత్రులు జనరేటర్ల కోసం ఇంధనాన్ని రేషన్ పద్ధతిలో వాడుతున్నాయి. కొన్నిరకాల పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. రవాణా, ఆహారం, విద్యుత్ రంగాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఆర్థికంగా అన్ని వైపుల నుంచి తాకిడి పెరుగుతోంది. భారత ఎగుమతుల్లో 17శాతాన్ని గల్ఫ్ దేశాలు స్వీకరిస్తున్నాయి. విస్తృత మార్కెట్లకు ముఖద్వారాలుగా ఉన్న యూఏఈ, సౌదీ హబ్‌లు ఇప్పుడు సరఫరాలో జాప్యాలు, ఆకాశాన్ని అంటుతున్న రవాణా ఛార్జీలు, యుద్ధ రుసుములతో సతమతమవుతున్నాయి. దాంతో చిన్న, మధ్యతరహా ఎగుమతిదారుల లాభాలు కనుమరుగవుతున్నాయి.

భౌగోళిక రాజకీయాలకు మూల్యం : పరిస్థితులు గందరగోళంగా మారడంతో ప్రభుత్వం పలు చర్యలతో రంగంలోకి దిగింది. చమురు కొరత లేదంటున్న అధికారులు ప్రశాంతంగా ఉండాలని కోరుతున్నారు. దౌత్యం ద్వారా త్వరలోనే హర్మూజ్ జలసంధి సమస్య పరిష్కారమయ్యేలా కనపడుతోంది. ముడిచమురు ధర 85-90 డాలర్ల దగ్గర స్థిరంగా ఉంటుందనే ఆశావాదం వ్యక్తమవుతోంది. భారత్ తన దగ్గరి నిల్వలతోపాటు, రష్యా సరఫరాలతో గండంలోంచి బయటపడుతుందని అంచనా వేస్తున్నారు. జీపీఎస్ జామ్‌లు, ఇరాన్ అణు బెదిరింపుల వల్ల బీమా స్తంభనలు దీర్ఘకాలం కొనసాగుతాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఎరువుల కొరతపై వార్తలు రైతులకు గుబులు పుట్టిస్తున్నాయి. ఈ గందరగోళం భారతదేశ ఇంధన బలహీనతను బయటపెడుతోంది. ఇండియాతో పాటు మరికొన్ని దేశాల్లోనూ పరిస్థితులు ఇలాగే అగమ్యగోచరంగా ఉన్నాయి. సుదూర తీరాల్లోని భౌగోళిక రాజకీయాలకు సామాన్యులు మూల్యం చెల్లించాల్సిన అగత్యం నెలకొంది. యుద్ధవిరమణ దిశగా ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేస్తేనే ఈ సంక్షోభం సమసిపోతుంది.




## టర్మ్ ఇన్సూరెన్స్‌తో..
# రికార్డ్ క్రియేట్ చేస్తారా..!

హైదరాబాద్,: తెలంగాణ ప్రభుత్వ బడ్జెట్‌లో అత్యంత ఆకర్షణీయమైన ప్రకటన "ఇందిరమ్మ ఫ్యామిలీ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్". డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం ప్రకారం, 2026 జూన్ 2 నుంచి రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పేదలు, మధ్యతరగతి, ధనికులు అనే తేడా లేకుండా అందరికీ ఈ పథకం వర్తిస్తుందనడం వల్ల ఈ హామీ సాధారణ సంక్షేమ పథకాన్ని మించిన రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పథకం కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఒక్కసారిగా ఆర్థికంగా కుంగిపోకుండా రక్షించే సోషల్ సెక్యూరిటీ స్కీం అనొచ్చు.ఉపముఖ్యమంత్రి బడ్జెట్ ప్రసంగంలో చెప్పినట్టు తెలంగాణ యే దేశంలో మొదటిదా అంటే కాదని చెప్పొచ్చు. ఎందుకంటే నాగాలాండ్ ఇప్పటికే పేరుతో 2024 ఆగస్టు 15న ఒక రాష్ట్రవ్యాప్త కుటుంబ-ఆధారిత బీమా మోడల్‌ను ప్రారంభించింది. ఆ పథకంలో కుటుంబ పోషకుడు మరణించినప్పుడు రూ.2 లక్షల జీవిత బీమా కల్పించింది. అయితే లబ్దిదారుల సంఖ్యాపరంగా చూస్తే కేవలం 2.5 లక్షల కుంటుంబాలు మాత్రమే అంటే తెలంగాణ లబ్దిదారుల్లో అవి కేవలం 2.1 శాతం మాత్రమే.. అందువల్ల తెలంగాణ మొట్టమొదటి రాష్ట్రం కాదు కానీ కోటీ పదిహేను లక్షల కుటుంబాలు లక్ష్యంగా ఇంత పెద్ద స్థాయి పథకం మాత్రమే తెలంగాణ మాత్రమే అని చెప్పొచ్చు.ఇప్పటికే కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనతో పోల్చితే... ఖఓఏఏఃజ వ్యక్తిగత జీవిత బీమా పథకం. దానిలో ఏదేని కారణంతో బీమా పొందిన వ్యక్తి మరణిస్తే రూ.2 లక్షల కవరేజ్ ఉంటుంది. అందులో చేరేందుకు 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు వారై ఉండాలి. ఈ పథకం బ్యాంక్ లేదా పోస్టాఫీస్ ఖాతా ద్వారా, ప్రతి సంవత్సరం రూ.436 ప్రీమియం మన బ్యాంకు ఖాతా నుంచి ఆటో-డెబిట్ అవుతోంది. అంటే ఇది అందరికీ అందే సార్వత్రిక పథకం కాదు; వ్యక్తిగతంగా నమోదు చేసుకుని పథకంలో చేరితేనే వర్తిస్తుంది. తెలంగాణ ప్రకటించిన పథకం మాత్రం మరింత విస్తృతమైంది. ఇది కుటుంబం ఒక యూనిట్‌గా, రూ.5 లక్షలు బీమా కవరేజీ వర్తిస్తుంది. పైగా ప్రభుత్వం దీన్ని సంక్షేమ హామీగా ప్రకటిస్తోంది, ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఈ తేడా చిన్నది కాదు ఒకరకంగా చెప్పాలంటే ప్రజాసంక్షేమ విధానంలో చాలా పెద్ద ముందడుగు. "ఇందిరమ్మ ఫ్యామిలీ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్"కు సంబంధించిన పూర్తి విధి విధానాలింకా రూపొందించలేదు. కేంద్ర పథకం ఖఓఏఏఃజతో తెలంగాణ స్కీమ్‌ను కలపగలరా అనే ఆలోచనపై ఇప్పటికెలాంటి స్పష్టతా లేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం పలు వెసులుబాట్లు పరిశీలించొచ్చు. ఒకటి, రాష్ట్రమే సొంతంగా ఒక గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకం నడపడం. రెండోది, ఖఓఏఏఃజని ఆసరా చేసుకుని దానికి రాష్ట్రం టాప్-అప్ కవరేజ్ ఇవ్వడం. మూడోది, అర్హులైన వారికి ప్రీమియం రాష్ట్రం చెల్లించి, మిగిలిన వర్గాలకు వేరుగా పథకం అమలుచేయడం. కానీ ఒక సమస్య ఉంది. ఖఓఏఏఃజలో వయో పరిమితి, బ్యాంక్ ఖాతా, ఇఃనీనిబవనిబి, జీనినిబీజీశ్రీ తీవనివలిజీశ్రీ వంటి షరతులు ఉన్నాయి. తెలంగాణ బడ్జెట్ ప్రసంగంలో మాత్రం "అందరికీ" అనే మాట ఉంది. కాబట్టి రాష్ట్రంపై భారం మాత్రం భారీగానే వుండొచ్చు.పేదల కోసం, గ్రామీణ భూమి లేని కుటుంబాల కోసం, అసంఘటిత కార్మికుల కోసం, ప్రమాద బీమా అవసరమున్న వర్గాల కోసం గతంలో ఇలాంటి పథకాలు వచ్చాయి. కానీ "ప్రతి కుటుంబానికి జీవిత బీమా" అనే స్థాయిలో, రాష్ట్రంఅధికారికంగా పెద్ద ఎత్తున హామీ ఇవ్వడం మాత్రం తెలంగాణనే మొదటి రాష్ట్రం.అందుకే తెలంగాణప్రకటన రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకోనుంది. పైగా కేవలం పేదలకే పరిమితం కాకుండా మధ్యతరగతి, ఎగువ తరగతుల వారికీ బీమా అందించడం సంక్షేమ పథకాల అమలులో ఓ పెద్ద మలుపు.

ఐదు ప్రధాన సవాళ్లు: మొదటిది కుటుంబ నిర్వచనం- కుటుంబం అంటే ఎవరెవరు? రెండోది కుటుంబ పోషకుడు గుర్తింపు- ఒక కుటుంబంలో ఇద్దరు సంపాదిస్తే? మహిళే ప్రధాన ఆదాయ వనరు అయితే? మూడోది వయస్సు, రిస్క్, ప్రీమియం భారం ? వయస్సు పరిమితి లేకుండా పెద్ద ఎత్తున కవరేజ్ ఇస్తే ప్రీమియం ఖర్చు గణనీయంగా పెరగొచ్చు. నాలుగోది లబ్దిదారుల జాబితా ? లబ్ధిదారుల డేటాబేస్ బలంగా లేకపోతే క్లెయిమ్‌ల వద్ద వివాదాలు మొదలవుతాయి. ఐదోది, అంతకంటే ముఖ్యమైనది క్లెయిమ్ సెటిల్‌మెంట్ వేగం. ఇప్పటికే ఇలాంటి పథకం అమలవుతున్న నాగాలాండ్‌లో ఎదురవుతున్న ప్రధాన సవాలు.

మొత్తానికి పథకం విజయవంతంగా అమలైతే ఆరోగ్యశ్రీ పథకంతో రాజశేఖర్ రెడ్డికి, రైతు భీమా, రైతు బందుతో కేసీఆర్‌కి వచ్చిన మంచి గుర్తింపు రేవంత్ రెడ్డికీ వస్తుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం లాగా తెలుగు రాష్ట్రం మరోసారి దేశానికి ఆదర్శంగా నిలవగల స్థాయి ఈ అందరికీ ఉచిత జీవిత బీమా పథకానికుంది. కాబట్టి అవరోధాలు లేకుండా అమలు చేయడంలోనే రేవంత్ సర్కార్ సత్తా నిరూపితమౌతుంది.

# అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: మంత్రి పొన్నం



ఆదిలాబాద్: మహా లక్ష్మీ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండడంతో నియోజకవర్గాల వారిగా కావాల్సిన మౌలిక సదుపాయాలు, కొత్త బస్సులు, బస్ స్టేషన్ ల అభివృద్ధి , కొత్త రూట్లు,బస్ డిపో ల అవసరాల పై మూడు రోజులుగా ఉమ్మడి జిల్లాల ప్రజా ప్రతినిధులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులతో కలిసి ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. మూడవ రోజు అదిలాబాద్ , కరీంనగర్ , ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధులతో అసెంబ్లీ కమిటీ హాల్ -1 లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చెన్నూరు నియోజకవర్గంలో బస్ స్టేషన్ అభివృద్ధి తో పాటు కొత్త రూట్ లలో బస్సులు నడిపించాలని మంత్రి వివేక్ వెంకట్ స్వామి సూచించారు. సింగరేణి ఏరియాలో కార్మికులకు ఇబ్బందులు లేకుండా గతంలో నడిచిన రూట్లతో పాటు అదనపు రూట్ లలో నడిపించాలని కోరారు. ఖానాపూర్ నియోజకవర్గంలో జగిత్యాల నుండి కడెం బస్సులు నడిపించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సూచించారు. ఆదిలాబాద్ , కరీంనగర్ , హైదరాబాద్ కి బస్సులు పెంచాలన్నారు. ఉట్నూరు ఆదిలాబాద్ మధ్య బస్సులు నడిపించాలని ఉట్నూరు ఆర్టీసీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. నిజాం కాలంలో నిర్మించిన ఆసిఫాబాద్ పురాతన బస్ స్టేషన్ అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కోవా లక్ష్మీ విజ్ఞప్తి చేశారు. బస్ స్టేషన్ లో ఫ్లాట్ ఫాం సంఖ్య పెంచాలని కోరారు. 5 పల్లె వెలుగు బస్సులు గ్రామాలకు నడపాలని కోరారు. నియోజకవర్గం నుండి వేములవాడ , కొండగట్టు కి ప్రత్యేక బస్సులు నడపాలని కోరారు. ఆర్టీసీ పెట్రోల్ బంకు ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. బస్ స్టేషన్ లో టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. బోథ్ లో చాలా రూట్ లలో బస్సులు బంద్ అయ్యాయని కొత్త రూట్ లలో బస్సులు నడిపించాలని కోరారు. ఇచ్చోడ బస్ స్టేషన్ 18 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉందని దానిని అభివృద్ధి చేయాలని కోరారు. సిరికొండ , తలైగూడ, కరంజీ, నిగ్నె , వధురు , కుంతల మీదుగా బస్సులు నడపాలని సూచించారు. 2027 జూన్ లో పుష్కరాలు సమీపిస్తుండటంతో బాసర లో బస్ స్టేషన్ ఆధునీకరించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ విజ్ఞప్తి చేశారు. ఫ్లాట్ ఫామ్ పెంచాలని , టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. ఉబెర్ బస్ స్టేషన్ లో సీసీ వేయాలని కోరారు. భైంసా నుండి పోఫ్రోద్ బస్సులు నడపాలన్నారు. సిర్పూర్ కాగజ్ నగర్ లో బస్ స్టేషన్ అభివృద్ధి చేయాలని రోడ్లతో సంబంధం లేకుండా మారుమూల ప్రాంతాల్లో బస్సులు నడపాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ విజ్ఞప్తి చేశారు. మూడు రోజులుగా ఉమ్మడి జిల్లాల వారిగా మంత్రులు , ఎమ్మెల్యేలు ఇచ్చిన వినతులు స్వీకరించామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అన్ని జిల్లాలో నియోజకవర్గాల వారిగా ఆర్టీసీ సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అన్ని బస్ స్టేషన్లలో టాయిలెట్స్ , మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. బస్ స్టేషన్ అభివృద్ధిలో ఆర్టీసీ తో ఎమ్మెల్యేలు తమ ఫండ్స్ ద్వారా సహకరించాలని కోరారు. కొత్త వస్తున్న బస్సులు ఎక్కడెక్కడ అవసరాలు ఉన్నాయి అక్కడకి పంపిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా కొత్త రూటులో బస్సులు పంపించడానికి యాక్షన్ ప్రాన్స్ సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులతో లు ఆర్టీసీ అధికారులు ప్రజాసంబంధాలు కలిగి ఉండాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వహిస్తే ఆ చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్షా సమావేశంలో కరీంనగర్ ఆదిలాబాద్ , ఖమ్మం ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, డా,, సంజయ్ కుమార్, కౌశిక్ రెడ్డి , మేడిపల్లి సత్యం, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, విజయ రమణ రావు , వెడ్మా బొజ్జు,కోవా లక్ష్మీ ,అనిల్ జాదవ్ , రామారావు పటేల్ ,పాల్వాయి హరీష్ బాబు ,పాయం వెంకటేశ్వర్లు ,రాందాస్ నాయక్ , జారే ఆది నారాయణ, కోరం కనకయ్య , ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడి లు , ఆర్ఎం లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయం పనుల్లో నాణ్యత పాటించాలి : కలెక్టర్ ఆదర్శ్ సురభి



రేవల్లి తహశీల్దార్ కార్యాలయం పనుల్లో నాణ్యత పాటించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం ఏదుల, రేవల్లి మండలాల్లో నూతనంగా నిర్మించిన తహశీల్దార్ కార్యాలయాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏదుల, రేవల్లి మండలాల్లో తహశీల్దార్ కార్యాలయాలను నూతనంగా నిర్మించిన భవనాలకు షిఫ్ట్ చేసి, అక్కడ నుంచే ప్రజలకు సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతన భవనా ల్లో ఫర్నిచర్ ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశిం చారు. త్వరలోనే కార్యాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సేవలు అందేలా నూతన కార్యాలయాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. రేవల్లి తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లడానికి అంతర్గత సీసీ రోడ్డు, ప్రజలు నిలువు స్థలం, నీటి వసతి పూర్తి చేయాలని తహశీల్దార్ సరస్వతి వినతి మేరకు పంచాయతీరాజ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రేవల్లి తహశీల్దార్ సరస్వతి, ఏదుల తహశీల్దార్ మల్లికా ర్జున్, ఆర్ఐలు పవన్, శంకర్, సిబ్బంది రాజేష్, భరత్ పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం కూడదు!



ఇటీవల దేశంలోని వివిధ నగరాల్లో జరిగిన అగ్ని ప్రమాదాలు మన వ్యవస్థలోని భద్రతా లోపాలను ఎత్తి చూపిస్తున్నాయి. ఢిల్లీ, ఇండోర్ నగరాల్లో నివాస భవనాలు మంటల బారిన పడడం, ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు- పిల్లలు, మహిళలతో సహా విగత జీవులు కావడం విషాదకరం. ఒడిషాలోని కటక్ ప్రభుత్వాసుపత్రి ఐసియులో మంటలు చెలరేగి 12 మంది రోగులు మృతి చెందటం బాధాకరం. భద్రం అని భావించి ఇళ్లల్లో ఆదమరచి నిదురపోతున్నప్పుడు, అనారోగ్యం నుంచి బయటపడటానికి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నప్పుడు ఇలా అగ్నికీలలకు బలి కావటం... ఆయా కుటుంబాలకు తీరని దు:ఖం, పూడని వెలితి కలిగిస్తుంది. జాగ్రత్తకు, అప్రమత్తతకు చిరునామాగా ఉండాల్సిన ఐసియుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించటం చాలా ఆందోళనకరం. వాటి నిర్మాణంలోనూ, నిర్వహణలోనూ, ప్రమాణాల పాటింపులోనూ తిష్ట వేసిన నిర్లక్ష్యానికి నిదర్శనం.

అగ్ని ప్రమాదాల కారణంగా మనదేశంలో ఏటా 22 వేల మంది మరణిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. సగటున రోజుకు 59 మంది మంటలకు బలవుతున్నారు. ఇందులో 66 శాతం మంది మహిళలు కావడం గమనార్హం. అగ్నిప్రమాదాల్లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచం మొత్తం మీద జరిగే అగ్ని ప్రమాదాల్లో ఐదింట ఒకటి మనదేశంలోనే సంభవిస్తోంది. నివాస గృహాల్లో, ఆసుపత్రి ప్రాంగణాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించిన సంఘటనలు గతంలోనూ ఉన్నాయి. 2000 సంవత్సరం ఆగస్టులో విజయవాడలో ఒక కార్పొరేట్ హాస్పటల్ నిర్వహిస్తున్న కోవిడ్ కేర్ సెంటర్లో అగ్నిప్రమాదం జరిగి, 10 మంది ప్రాణాలు కోల్పోయారు. గతేడాది అక్టోబర్‌లో రాజస్థాన్‌లోని ఐసియులో ఇలాంటి సంఘటనే జరిగి, ఆరుగురు రోగులు మృతి చెందారు. 2024లో ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ హాస్పటల్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి, నవజాత శిశువులు చనిపోయిన దుర్ఘటన దేశం అంతటినీ కలచివేసింది. 2021లో మహారాష్ట్రలో ఇలాంటి ప్రమాదాలు రెండు నమోదయ్యాయి. 2016లో భువనేశ్వర్‌లోని ఒక ప్రైవేటు హాస్పటల్ ఐసియులో మంటలకు 22 మంది బలయ్యారు. ఈ సంఘటన తరువాత భద్రతా ప్రమాణాల పెంపు మీద, తనిఖీల మీద దృష్టి పెట్టినట్టు అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకొచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అగ్ని నిరోధక చర్యల కోసం ప్రత్యేకంగా రూ.320 కోట్లు వెచ్చించి, వివిధ రక్షణ ఏర్పాట్లు చేసినట్టు కూడా వివరించింది. అయినా, కటక్ ప్రభుత్వ ఎస్‌సిబి మెడికల్ కాలేజీ అండ్ హాస్పటల్ నిర్వహణలోని ట్రామా కేర్ సెంటర్లో అగ్ని ప్రమాదాన్ని నివారించలేకపోయారు. ఆ ఆసుపత్రి ఆవరణలోనే అగ్ని నిరోధక విభాగం ఉంది. సిబ్బంది వారికి సకాలంలో సమాచారం ఇవ్వలేదని, అందుచేత అరగంట ఆలస్యంగా మంటల నియంత్రణ, రోగుల రక్షణ చర్యలు మొదలయ్యాయని అధికారులు చెబుతున్నారు. అగ్ని నిరోధక సిబ్బంది కూడా తమ వద్ద ఉన్న ఉపకరణాలను సమర్థవంతంగా ఉపయోగించలేకపోయారని అంటున్నారు. ఆపద చుట్టుముట్టిన వేళ అప్రమత్తం కావటంలోనూ, నివారణోపకరణాలను వినియోగించటంలో తగిన తర్ఫీదు, సన్నద్ధత లేకపోవటం ఆక్షేపణీయం. చాలా సందర్భాల్లో పాలకులు సంఘటన జరిగినప్పుడు హడావిడి చేసి, ఆనక ఆ సంగతిని విస్మరించటమే ఇలాంటి దుస్థితికి కారణం. అగ్ని ప్రమాదాలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకోవటం, జరిగితే వెంటనే అదుపు చేసి, ప్రాణనష్టాన్ని నివారించటం ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలి. దీనికి సంబంధించి భవన నిర్మాణాలు, ఇతర ఏర్పాట్లూ ఎలా ఉండాలి? ఆసుపత్రులు, విద్యాసంస్థలు, కర్మాగారాల నిర్వహణ ఎలా జరగాలి? అన్న దానిపై ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. వాటిని అమలు చేయటంలో అధికార యంత్రాంగపు ఉదాసీనత, మొక్కుబడి తంతు అసలు సమస్య. ప్రమాదం జరిగినప్పుడు చేసే హడావిడి ఒక వ్యవస్థాగత విధానంగా, అప్రమత్తతగా కొనసాగకపోవటం మళ్లీ మళ్లీ ప్రమాదాలు జరగటానికి తావిస్తోంది. అలాగే, మంటలను నిరోధించటానికి నీటిని మాత్రమే ఉపయోగించటం పాత పద్ధతి. కార్బన్ డయాక్సైడ్, ఫోమ్ వంటి నిప్పు నిరోధకాలను ఎక్కువగా వినియోగించాలి. తగిన సంఖ్యలో సిబ్బంది నియామకం, నైపుణ్యాల పెంపు, మాక్ డ్రిల్స్ నిర్వహణ, ప్రజల్లో అవగాహన వంటి చర్యలు కూడా చాలా అవసరం. చేతులు కాలాక ఆకులు పట్టుకోకూడదన్న పెద్దల హితోక్తిని ప్రభుత్వాలు సదా జ్ఞాపకం ఉంచుకోవాలి. ప్రాణాలు పోయాక పరిహారాలు ప్రకటించటం కాదు; ప్రమాదాలు జరక్కుండా అన్ని విధాలా అవసరమైన చర్యలు తీసుకోవాలి.

# గ్రేటర్ లో కోర్ అర్బన్ యాక్ట్





హైదరాబాద్, : తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మహానగరాభివృద్ధి కోసం దశాబ్దాల కాలం నాటి పాత చట్టాలను పక్కన పెట్టి, అత్యంత శక్తివంతమైన కోర్ అర్బన్ రీఫార్మ్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ చట్టాన్ని తీసుకువస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో రాబోయే ఈ కొత్త చట్టం, నగర పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. ప్రధానంగా అక్రమ కట్టడాల నియంత్రణ, చెరువుల సంరక్షణ , విపత్తు నిర్వహణను ఒకే గొడుగు కిందికి తీసుకురావడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కొత్త చట్టం ద్వారా హైడ్రా కు తిరుగులేని చట్టబద్ధమైన అధికారాలు లభించనున్నాయి. ఇప్పటివరకు అక్రమ నిర్మాణాల కూల్చివేతకు హైడ్రా అధికారులు ఇతర మునిసిపల్ విభాగాలపై లేదా రెవెన్యూ అధికారుల నోటీసులపై ఆధారపడాల్సి వచ్చేది. కానీ కోర్ చట్టం అమలులోకి వస్తే, హైడ్రా నేరుగా అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసే అధికారంతో పాటు, తక్షణమే కూల్చివేతలు చేపట్టే విచక్షణాధికారాలను కూడా పొందుతుంది. దీనివల్ల కాలయాపన తగ్గి, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుంది. నగర పరిధిలోని ప్రభుత్వ భూములు, ఎఫ్‌టీఎల్ పరిధులు , బఫర్ జోన్ల ఆక్రమణలను అడ్డుకోవడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుంది. నోటీసులు ఇచ్చే ప్రక్రియను డిజిటలైజ్ చేయడం ద్వారా పారదర్శకతను పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా, నిబంధనలు ఉల్లంఘించే భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేసేలా కఠిన నిబంధనలను ఇందులో పొందుపరిచారు. ఇది క్షేత్రస్థాయిలో అవినీతిని అరికట్టడానికి దోహదపడుతుందని నిపుణులు భావిస్తున్నారు. కోర్ చట్టం కేవలం అక్రమ కట్టడాల కూల్చివేతకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో హైదరాబాద్‌ను ఒక ప్రణాళికాబద్ధమైన ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు పునాదిగా నిలవనుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నాటి పాత చట్టాల వల్ల ఎదురవుతున్న న్యాయపరమైన చిక్కులను అధిగమిస్తూ, నూతన తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ఈ చట్టాన్ని రూపొందిస్తున్నారు. అసెంబ్లీలో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి, అధికారికంగా అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

### లారీ లో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం స్వాధీనం - ముగ్గురు అరెస్ట్, లారీ సీజ్

మహబూబాబాద్ : జిల్లా టాస్క్ ఫోర్స్, కురవి పోలీస్ సంయుక్త ఆపరేషన్లో భాగంగా అక్రమ సారాయి తయారీకి ఉపయోగించే నల్లబెల్లం రవాణాపై చర్యలు చేపట్టారు. చిత్తూరు నుండి మహబూబాబాద్ వైపు అక్రమంగా తరలిస్తున్న లారీని కురవి శివారు సోమ్లా తండా సమీపంలో ఆపి తనిఖీ చేయగా, అందులో సుమారు ?8,00,000 విలువైన 70 క్వింటాళ్ల నల్లబెల్లం మరియు 10 క్వింటాళ్ల పట్టిక స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులు గుగులోత్ సుమన్, ఆరెపల్లి మధు, బొల్లా విజయ్ కుమార్ లను అరెస్ట్ చేసి, లారీని సీజ్ చేసారు. ఈ ఆపరేషన్లో టాస్క్ ఫోర్స్ సిఐ హతీరామ్, ఎస్సై తాహేర్ బాబా, కురవి ఎస్సైగంద్రాతి సతీష్, ఎస్సై జయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# వర్క్ ఫ్రమ్ హోమ్ అంటూ సెటైర్లు




హైదరాబాద్: సాధారణంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' ఆప్షన్ ఉంటుందని మనందరికీ తెలుసు. కానీ ఒక రాష్ట్రానికి ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉంటూ సభ గడప తొక్కకుండానే "అటెండెన్స్ అక్కర్లేని అసాధారణ ఉద్యోగి" గా కొత్త రికార్డు సృష్టించారు మన గులాబీ బాస్. 'రాజ్యం పోయినా రాచరికం పోలేదు' అన్న సామెతను నిజం చేస్తూ గజ్వేల్ ఫామ్ హౌస్ నుంచే ప్రజాస్వామ్యాన్ని శాసిస్తున్న తీరుపై ఇప్పుడు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. సామాన్యుడు ఒక్క రోజు ఆఫీస్ మానేస్తే జీతంలో కోత పడుతుంది. కానీ మన ప్రతిపక్ష నేత గారికి మాత్రం ఇప్పటి వరకు అక్షరాలా రూ. 1.06 కోట్ల జీతభత్యాలు ప్రభుత్వం చెల్లించింది. సభకు వచ్చి ప్రజా సమస్యలపై గళం ఎత్తాల్సిన బాధ్యతను పక్కన పెట్టి, కేవలం అకౌంట్‌లో పడే మెసేజ్‌లకే పరిమితమైన ఈ 'రాజకీయం' చూసి సామాన్యులు నోరెళ్లబెడుతున్నారు. "కోటి రూపాయల జీతం తీసుకుంటూ కోలుకోలేని నిద్రలో ఉండటం" అంటే ఇదేనేమోనని చర్చించుకుంటున్నారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లా అసెంబ్లీలో 'తెలంగాణ రైజింగ్ 2047' అంటూ భవిష్యత్ ప్రణాళికలు వివరిస్తుంటే.. ప్రధాన ప్రతిపక్షం మాత్రం "మేము రాము.. మాకు ఆ విజన్ డాక్యుమెంట్లు పట్టవు" అన్నట్లుగా వ్యవహరించింది. దీనిపై రేవంత్ సెటైర్ వేశారు. ఏఐ (ఎఐ) సునామీ రాబోతోందని గవర్నర్ చెబితే, ప్రతిపక్షం మాత్రం ఇంకా పాత రికార్డులే వేస్తోంది. కనీసం విజన్ డాక్యుమెంట్ చదివారా? అంటే.. "మాకు అధికారం పోయిన దుఃఖం చదవడానికే టైమ్ సరిపోవడం లేదు" అన్నట్లుగా ఉందని ఎద్దేవాచేశాడు. నాలుగు కోట్ల మంది ప్రజలు తమ గొంతుక వినిపిస్తారని అసెంబ్లీ వైపు చూస్తుంటే, ప్రతిపక్ష నాయకుడు మాత్రం గవర్నర్‌కు కనీసం శుభాకాంక్షలు చెప్పడానికి కూడా రాలేదు.

సభకు రాకుండా జీతం తీసుకోవడం అనేది ఒక "మాయని మచ్చ" అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అంటే విధులకు హాజరు కాకుండా జీతం తీసుకునే ఈ కొత్త ట్రెండ్‌పై ఇప్పుడు స్పెషల్ క్లాస్ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అసెంబ్లీకి రాకుండా జీతం తీసుకోవడం అనేది 'కళ' అయితే.. అందులో కేసీఆర్ గారు 'ఆస్కార్' రేంజ్ పర్ఫార్మెన్స్ ఇస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెవులు కొరుక్కుంటున్నారు. మరి ఈ 'కోటి రూపాయల అటెండెన్స్' వివాదం ఎటు దారితీస్తుందో చూడాలి!

## మౌలిక సదుపాయాలతో పాటు నాణ్యమైన పోషకాహారం ఇవ్వాలి


### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఖమ్మం : ప్రభుత్వ సంరక్షణలో ఉన్న ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగడం ప్రభుత్వ లక్ష్యమని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే పిల్లలు చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం నగరంలోని ఎన్.ఎస్.పి. రోడ్‌లోని బాలల సదనాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలలో తిరుగుతూ పరిశుభ్రత, మౌలిక వసతులు, పడక గదులు, బాత్‌రూములు, త్రాగునీటి సదుపాయం, వంటగది నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించారు. వంటగదిలో తయారవుతున్న ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా చూసి, పిల్లలకు అందిస్తున్న అల్పాహారం, భోజనం కామన్ మెనూ ప్రకారం సరైన ప్రమాణాలతో అందుతున్నాయా అని తెలుసుకున్నారు. అన్నం, కూరలు, పప్పు, సాంబారు, గుడ్లు, చికెన్ వంటి పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. పిల్లలతో నేరుగా ముచ్చటించిన కలెక్టర్, భోజనం రుచిగా ఉందా, సమయానికి అందిస్తున్నారా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లల అభిప్రాయాలను వినడం ద్వారా సేవల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ బాలల సదనాల్లో ఉన్న పిల్లలు మన కుటుంబ సభ్యుల్లాంటి వారని, వారికి అందించే ఆహారం పోషక విలువలతో కూడినదిగా, రుచికరంగా ఉండాలని అన్నారు. పరిశుభ్రత, ఆరోగ్య సేవలు, భద్రత అంశాల్లో ఎల్లప్పుడూ అత్యున్నత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పిల్లలలో ఆత్మవిశ్వాసం పెంచే విధంగా విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించాలని అన్నారు. దత్తత ప్రక్రియలో పారదర్శకత అత్యంత ముఖ్యమని, అర్హత కలిగిన కుటుంబాలకు మాత్రమే చట్టపరమైన విధానాల ప్రకారం పిల్లలను దత్తత ఇవ్వాలని, ప్రతి దశలో బాలల హితం ప్రాధాన్యంగా ఉండే విధంగ బాలల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత, జిల్లా శిశు సంరక్షణ అధికారిణి విష్ణు వందన, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నట్టింట్లో కల్తీ రక్కసి

హైదరాబాద్: భారతదేశంలో ఆహార కల్తీ రక్కసి కోరలు చాస్తున్నది. యేటా దేశవ్యాప్తంగా కల్తీ ఆహారం కారణంగా సుమా రు 70 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారనే చేదు నిజాన్ని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక ప్రకారం.. భారత్‌లో యేటా 10 కోట్ల మంది కల్తీ ఆహారం తీసుకుని అనారోగ్యానికి గురవుతున్నారు. ఇందులో 20 శాతం మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. ఫలితంగా నిల్వ ఉంచిన కలుషిత ఆహారం కొనుక్కుని తిని మరీ ప్రజలు రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఆహార భద్రతా ప్రమాణా ల అమలులో ఆంధ్రప్రదేశ్ గత ఐదేళ్ల కాలం లో అట్టడుగు స్థానానికి పడిపోయింది. తెలు గు రాష్ట్రాల్లో పాల కల్తీ నిరంతరాయంగా సాగుతున్న ఒక ప్రమాదకర వ్యాపారంగా మారింది. పసి పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి రోజూ వినియోగించే పాలు ఇప్పుడు విషపూరిత రసాయనాలతో నిండిపోతున్నాయి. పాల సాంద్రత పెంచేందుకు గంజి పొడిని వాడుతున్నారు. వంటగదిలో నిత్యం వినియోగించే పదార్థాలు, మసాలాలన్నీ ఇప్పుడు కల్తీ కాటుకు గురవుతున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు ప్రధాన పట్టణాల్లో తరచూ 'కల్తీ'కారుల అక్రమాలు వెలు గు చూడటం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల మైలార్‌దేవ్‌పల్లి, లాలాగూడల్లో అపరిశుభ్ర వాతావరణంలో తయారవుతున్న కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ కేంద్రాలపై పోలీసులు జరిపిన దాడులు ఒక ఎత్తయితే, బంజారాహిల్స్ వంటి సంపన్నుల నివాస ప్రాంతంలో 'ప్రైడ్ డెయిరీ' పేరిట సాగుతున్న కల్తీ నెయ్యి దందా మరో ఎత్తు. కేవలం అల్లం వెల్లుల్లి, నెయ్యి మాత్రమే కాదు.. మనం నిత్య ఇంట్లో వినియోగించే పాలు, కారం, నూనె నుంచి టీ పొడి చివరకు.. ప్రతీది నకిలీమయం అవుతుండటం ఆందోళనకరం. శంషాబాద్ జోన్ పరిధిలోని జల్‌పల్లి, పహాడీషరీఫ్ ప్రాంతాల్లో పట్టుబడి న కల్తీ పదార్థాల తయారీ కేంద్రాలను పరిశీలిస్తే, ఆహార భద్రత ప్రమాణాలను గాలికొదిలేసి, లాభార్జనే ధ్యేయంగా దందా సాగినట్లు స్పష్టమ వుతున్నది. కల్తీల వెనుక వాస్తవాలు అత్యంత దారుణంగా ఉన్నాయి. అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీలో అక్రమార్కులు కుళ్లిన అల్లం, తక్కువ నాణ్యత గల వెల్లుల్లికి తోడు.. జిగురు కోసం ప్రమాదకరమైన 'ఎక్స్‌జన్ గమ్ పౌడర్', రంగు కోసం సింథటిక్ రసాయనాలు, నిల్వ ఉండటానికి అధిక మోతాదులో సిట్రిక్ యాసిడ్ వాడినట్లు అధికారులు గుర్తించారు. ఈ పదార్థాలు మనిషి శరీరంలోకి వెళితే జీర్ణకోశ వ్యాధుల నుంచి మొదలుకొని దీర్ఘకాలంలో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. కల్తీ నెయ్యి విషయానికొస్తే, అక్రమార్కులు తక్కువ ధరకు లభించే పామాయిల్, డాల్డా, హైడ్రోజనేటెడ్ వెజిటబుల్ ఫ్యాట్స్‌ను ఆవు, గేదె పాల మీగడలో కలిపి తమదే స్వచ్ఛమైన నెయ్యి అని మార్కెట్లోకి వదులుతున్నారు. పాల ను చిక్కగా మార్చేందుకు వీరు యూరియా, డిటర్జెంట్ పొడి, గ్లూకోజ్, స్టార్చ్ పొడర్లు వాడుతున్నట్లు తేలింది. ఈ నెయ్యిని వినియోగిస్తే కాలేయం దెబ్బతినడం, మూత్రపిండాల వైఫల్యం, గుండె సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు ఈ కల్తీ మహమ్మారి ఇంతలా వేళ్లూనుకోవడానికి మారుతున్న జీవనశైలే ప్రధాన కారణమని విశ్లేషకులు చెప్తున్నారు. ఆధునిక కాలంలో 'ఇన్‌స్టంట్ ఫుడ్'పై మోజు, ఏ వంట అయి నా త్వరగా సిద్ధమైపోవాలనే ఆతృత.. కల్తీ కేటుగాళ్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఇంట్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసుకునే ఓపిక లేకపోవడం, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్స్ ద్వారా వచ్చే ఆకర్షణీయమైన ఆఫర్ల వెంట పడటం వల్ల మనం తెలియకుండానే విషాన్ని కొని తెచ్చుకుంటున్నాంతక్కువ ధరకే దొరుకుతున్నాయని నాణ్యతను పట్టించుకోకుండా రోడ్డు పక్కన విక్రయించే విడి అల్లం పేస్టులు, లోకల్ బ్రాండ్ నెయ్యి ప్యాకెట్లను ఆశ్రయించడం ప్రాణాంతకం. హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో లాభాల కోసం ఇలాంటి కల్తీ ఉత్పత్తులనే వాడుతున్నట్లు యంత్రాంగం విచారణలో తేలడం గమనార్హం. కేవలం పోలీసుల దాడులు, అరెస్టులతోనే ఈ వ్యవస్థ ప్రక్షాళన కాదు. వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలిసాధ్యమైనంత వరకూ ఇంట్లో తయారు చేసుకునే పదార్థాలనే, వినియోగించు కోవడం ఉత్తమం. అధిక లాభాల కోసం సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ ముఠాలపై ప్రభుత్వాలు కఠిన చట్టాలను ప్రయోగించి, కల్తీ మహమ్మారికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతై నా ఉంది. పాలు తెల్లగా కనిపించేందుకు అక్రమార్కులు వైట్ పెయింట్ ను ఉపయోగిస్తున్నారు. నిల్వ ఉంచేందుకు ఫార్మాలిన్ వంటి రసా యనాలను వాడుతున్నారు. కేవలం లాభాపేక్షే ధ్యేయంగా నకిలీ పాల రైతులు అవతారమెత్తి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఒక పాడి గేదె పెంపకం దారు వద్ద రెండు మూడు గేదె లు ఉంటే 20 నుంచి 30 మంది వినియోగదారులు ఉంటున్నారు. ఈ అదనపు పాలు ఎక్కడ నుంచి వస్తున్నాయో దేవుడికే తెలియాలి. బజారుకొకటి ఉంటున్న ప్రైవేట్ పాల కేంద్రాలు కాస్త కొద్దీ పాలను విక్రయిస్తున్నాయి. ఈ కేంద్రాల్లో యూరియా బస్తా ల నిల్వలు కనిపిస్తున్నాయి. పంటలకు దొరకని యూరియా ఇక్కడ నిల్వ ఉండటం వెనుక అసలు పరమార్థం ఇదే.ల కల్తీ కోసం అక్రమార్కులు యూరి యా, ఫార్మాలిన్, డిటర్జెంట్లు, అమ్మోనియం సల్ఫేట్, కాస్టిక్ సోడా వంటి భయంకరమైన రసాయనాలను ఉపయోగిస్తున్నారు. పాల సాంద్రతను పెంచేందుకు గంజి పొడిని కలుపుతున్నారు. నీళ్ల కలిపిన పాలు చిక్కగా కని పించేందుకు సబ్బును ఉపయోగిస్తున్నారు. వైట్ పెయింట్ ని పాలలో కలపడం కల్తీ దారుల మితిమీరిన తెలివికి నిదర్శనం. వీటివల్ల మూత్రపిండాల వ్యాధులు, క్యాన్సర్, జీర్ణకోశ సమస్యలు తలెత్తుతున్నా యి. ఫార్మాలిన్ రసాయనం కాలేయం, మూత్రపిండాలపై హానికరమైన ప్రభావాన్ని చూపుతుంది. పాలలో లాక్టోమీటర్ పరీక్షలతో కూడా గుర్తించలేని విధంగా కార్బోహైడ్రేట్లు కలుపుతున్నారు. ఇంతటి ప్రమాదకర స్థితి నుంచి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆహార భద్రతా శాఖతో తరచూ ఆకస్మిక దాడులు నిర్వహించి కల్తీకి పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి. లేనిపక్షంలో సామాన్య ప్రజలు రోగాలపాలై అర్థాంతరపు చావులకు గురికాక తప్పదు.



# రాత్రి పూట కొందరికి చిన్న శబ్దాలు కూడా పెద్దగా ఎందుకు వినిపిస్తాయి..?

చెవిలో ఉండే మైనం (ఇయర్‌వాక్స్) సహజంగా ఉత్పత్తి అవుతుంది. ఇది చెవి కెనాల్‌ను శుభ్రంగా ఉంచే, బ్యాక్టీరియాల నుంచి రక్షించే పదార్థం. ఇది చెవిని తడిగా ఉంచి రక్షణ కల్పిస్తుంది. సాధారణంగా డ్రై వాక్స్, వెట్ వాక్స్ అని రెండు రకాలుగా ఉంటుంది. అయితే ఇది అధికంగా పేరుకుపోతే ఐఎన్‌టీ వైద్యుల సహాయం అవసరం అవుతుంది. ఎక్కువగా గులిమి పేరుకుపోతే వినికిడి తగ్గడం, చెవిలో బ్లాక్ అయిన భావన, నొప్పి, మోగుతున్న శబ్దం (రింగింగ్), తల తిరగడంవంటి సమస్యలు కలుగుతాయి. పగటి సమయంలో ట్రాఫిక్, మాట్లాడే శబ్దాలు, సంగీతం వంటి బాహ్య శబ్దాలు మనకు వినిపించే అసహజ శబ్దాలను(టిన్నిటస్) కప్పిపుచ్చుతాయి.కానీ రాత్రి సమయంలో నిశ్శబ్దం పెరిగే కొద్దీ ఈ శబ్దాలు మరింత స్పష్టంగా వినిపిస్తాయి. దీనిని ఆడిటరీ గెయిన్ అని అంటారు. అంటే మెదడు వినికిడి లోపాన్ని భర్తీ చేయడానికి తన సున్నితత్వాన్ని పెంచుతుందన్నమాట. దీనివల్ల చెవిలో వినిపించే శబ్దం మరింత తీవ్రంగా అనిపిస్తుంది.

మెదడు కార్యకలాపాలతో సంబంధం..: రాత్రి సమయంలో నిశ్శబ్ద వాతావరణంలో టిన్నిటస్ తీవ్రత పెరుగుతుంది. దీని వల్ల నిద్ర చక్రం దెబ్బతింటుంది. ముఖ్యంగా లోతైన నాన్-రెమ్ నిద్ర దశలు తగ్గిపోతాయి. ఫలితంగా ఉదయం అలసట, రక్తపోటు, ఆందోళన పెరగడం వంటి సమస్యలు వస్తాయి. కొన్ని సందర్భాల్లో ఇది ఇన్సోమ్నియా (నిద్రలేమి)కి కూడా దారితీస్తుంది. టిన్నిటస్ కేవలం చెవికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు, ఇది మెదడు కార్యకలాపాలతో కూడా సంబంధం కలిగి ఉంటుంది. ఆడిటరీ, లింబిక్ వ్యవస్థల్లో అసాధారణ కార్యకలాపాలు మెదడును పూర్తిగా విశ్రాంతి పొందనీయవు. రాత్రి ప్రారంభంలో కొంత తగ్గినా, తర్వాతి గంటల్లో ముఖ్యంగా తేలికపాటి నిద్రలో మళ్లీ శబ్దం పెరుగుతుంది. రోజుకు సుమారు 8.5 గంటల నిద్ర అందేలా చూడడం టిన్నిటస్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. తక్కువ లేదా ఎక్కువ నిద్ర ఈ సమస్యను మరింత పెంచుతుంది. ఈ సమస్య ఉన్నవారు ఉదయాన్నే మత్తుగా ఉండడం, దృష్టి లోపించడం, నిద్రలేమి లక్షణాలు అనుభవించడం సాధారణంగా కనిపిస్తుంది.

సౌండ్ థెరపీ ఉపయోగకరం..: ఇక టిన్నిటస్ సమస్యను తగ్గించేందుకు సౌండ్ థెరపీ చాలా ఉపయోగకరంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. వైట్ నాయిస్ మెషీన్లు, ఫ్యాన్ శబ్దం లేదా వర్షం, సముద్ర అలల వంటి శబ్దాలు వినడం వల్ల చెవిలోని రింగింగ్ తగ్గుతుంది. ఇవి పగటి సమయంలో ఉన్న శబ్ద వాతావరణాన్ని అనుకరిస్తాయి. నిద్రకు ముందు సరైన అలవాట్లు కూడా కీలకం. నిద్రకు రెండు గంటల ముందు స్క్రీన్‌లకు దూరంగా ఉండాలి. బ్లూ లైట్ నిద్రను భంగం చేస్తుంది. మృదువైన లైటింగ్, హెర్బల్ టీ (కెఫీన్ లేకుండా), 4-7-8 శ్వాస వ్యాయామం (4 సెకన్లు లోపలికి శ్వాస, 7 సెకన్లు ఆపడం, 8 సెకన్లు బయటకు వదలడం) వంటి పద్ధతులు నాడీవ్యవస్థను ప్రశాంతం చేస్తాయి. తలను సుమారు 30 డిగ్రీల ఎత్తులో ఉంచి పడుకోవడం కూడా ఉపశమనం ఇస్తుంది. అలాగే కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ (జడీ) ద్వారా టిన్నిటస్‌పై స్పందనను మార్చుకోవచ్చు. గైడెడ్ సెషన్లు లేదా యాప్స్ ద్వారా ఈ శబ్దాన్ని నియంత్రించుకోవడం సాధ్యమవుతుంది.

జీవనశైలి మార్పులు అవసరం..: వీటితో పాటు జీవనశైలిలో కూడా కొన్ని మార్పులు చేసుకోవడం మంచిది. ఉప్పు, మద్యం వినియోగాన్ని తగ్గించడం మంచిది, ఎందుకంటే ఇవి టిన్నిటస్ తీవ్రతను పెంచుతా యి. భారీ వ్యాయామాన్ని పగటి సమయంలో చేయడం ఉత్తమం. శబ్ధం అధికంగా ఉండే ప్రదేశాల్లో చెవులను రక్షించేందుకు ఇయర్ ప్లగ్స్ ఉపయోగించాలి. వినికిడి లోపం అనుమానం ఉంటే ఆడియో గ్రామ్ పరీక్ష చేయించుకోవాలి. హియరింగ్ ఎయిడ్స్ వాడడం ద్వారా టిన్నిటస్ శబ్దం సుమారు 50 శాతం వరకు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. చికిత్స లేకుండా టిన్నిటస్ కారణంగా వచ్చే నిద్రలేమి దీర్ఘకాలంలో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. స్ట్రోక్ ప్రమాదం, మానసిక సమస్యలు, దీర్ఘకాల అలసట, డిమెన్షియా వంటి సమస్యలతో కూడా సంబంధం ఉందని పరిశోధనలు సూచిస్తు న్నాయి. అయితే సరైన చికిత్స, జీవనశైలి మార్పులు, నిపుణుల మార్గదర్శకత్వంతో ఈ సమస్యను నియంత్రించుకోవచ్చు. ప్రశాంత మైన శబ్దాలతో నిద్ర వాతావరణాన్ని సృష్టించడం ద్వారా మెరుగైన నిద్రను తిరిగి పొందవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.

# డాటాను తెగవాడేస్తున్నారు!

## 2025లో నెలకు దేశీయ సరాసరి డాటా వినిమయం 31 జీబీలు




న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా డాటా వినిమయం వాయువేగంతో దూసుకుపోతున్నది. సరాసరిగా నెలకు సగటు భారతీయుడు 31 జీబీల డాటాను వినియోగిస్తున్నారు. 2024లో 27.5 జీబీల డాటాను వినియోగిస్తుండగా..ఆ తర్వాత ఏడాది 2025లో ఇది 10 శాతం ఎగబాకి 31జీబీలకు చేరుకున్నదని టెలికాం పరికరాల తయారీ దిగ్గజం నోకియా తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. 13వ ఎడిషన్‌గా నోకియా వార్షిక మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ ఇండెక్స్‌ను మంగళవారం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా నెలవారీ 5జీ డాటా ట్రాఫిక్ 70 శాతం ఎగబాకి 12.9 ఎక్సాబైట్స్‌కి చేరుకున్నట్టు తెలిపింది. మొత్తం మొబైల్ బ్రాడ్ బ్యాండ్ యూజర్లలో 47 శాతం 5జీ యూజర్లే ఉన్నారు. 2025లో సరాసరి నెలవారీ మొబైల్ డాటా వినిమయం 31జీబీలకు చేరుకున్న దని, గడిచిన ఐదేండ్లలో సరాసరిగా 18 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు వేగవంతంగా విస్తరిస్తుం డటం, ఏఐ అప్లికేషన్లు, 4కే వీడియో స్ట్రీమింగ్, క్లౌడ్ గేమింగ్‌లకు ఉన్న డిమాండ్ వల్లనే డాటా వినిమయం ఊపందుకున్న దని పేర్కొంది. 5జీ సబ్‌స్క్రైబర్లలో ప్రపంచంలో రెండో స్థానంలో భారత్ నిలువగా, అలాగే 5జీ డాటా వినిమయంలోనూ, 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ కలిగివున్నవారిలో కూడా సెకండ్ ప్లేస్‌లో ఉన్నది.మెట్రో నగరాల్లో 5జీ అందుబాటులోకి రావడంతో ఇక్కడ వినియోగిదారులు భారీగా పెరిగారు. మొత్తం మొబైల్ వినిమయంలో ఈ వాటా 58 శాతానికి పైగా ఉన్నది. 2025 చివరినాటికి దేశవ్యాప్తంగా 89 కోట్ల 4జీ డివైజ్‌లు ఉండగా, 38.3 కోట్ల 5జీ డివైజ్‌లు ఉన్నాయి.

# పెందలాడే తింటేనే..



ఉదయం పెందలాడే నిద్ర లేవటం, రాత్రి పెందలాడే పడుకోవటం ఎంతో మంచిదని డాక్టర్లు తరచూ చెబుతున్నదే. ఇది భోజనానికీ వర్తిస్తున్నట్టు ఫ్రాన్స్ అధ్యయనం పేర్కొంటున్నది. ఉదయం 8 గంటలకు తొలి భోజనం (అల్పాహారం)తో ఆరంభించి రాత్రి 8 గం టలకు చివరి భోజనంతో తిండి తినటాన్ని ముగిస్తే గుండె, రక్తనా ళాలకు మేలు చేస్తున్నట్టు బయటపడింది మరి. రోజులో తొలి భోజనం ఆలస్యమవుతున్నకొద్దీ.. ప్రతి గంటకూ 6% చొప్పున గుండెజబ్బు ముప్పు పెరుగుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఉదాహరణకు ఉదయం 8 గంటలకు అల్పాహారం చేసేవారితో పోలిస్తే ఉదయం 9 గంటలకు టిఫిన్ తినేవారికి 6% ఎక్కువగా గుండెజబ్బు వచ్చే అవకాశం ఉందని పరిశోధకులు తేల్చారు. ఇక రాత్రి 8 గంటలకు ముందే చివరి భోజనం చేసేవారితో పోలిస్తే రాత్రి 9 గంటల తర్వాత భోజనం చేసేవారికి గుండెజబ్బు ముప్పు 28% ఎక్కువగా ఉంటుండటం గమనార్హం. కాబట్టి ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఒక్కొక్కరి ఆహార అవసరాలు ఒక్కోలా ఉన్నప్పటికీ వేళకు తినటం, భోజనానికీ భోజనా నికీ మధ్య తగినంత విరామం ఉండేలా చూసుకోవటం, పడుకునే ముందు మరీ ఎక్కువగా తినకపోవటం మంచిదని చెబుతున్నారు. అల్పాహారం, చివరి భోజనం పెందలాడే పూర్తి చేస్తే రాత్రి పూట తగినంత సేపు ఉపవాసం ఉన్నట్టు అవుతుంది. అలాగే త్వరగా, క్రమం తప్పకుండా, నిర్ణీత వేళల ప్రకారం ఆహారం తీసుకోవటం వల్ల శరీరంలోని వివిధ అవయవాల జీవగడియారాలు సమ్మిళితమవు తాయి. ఇవి రక్తపోటు వంటి గుండె జీవక్రియ పనితీరు మీద ప్రభావం చూపుతున్నాయని అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి. ఫలితంగా గుండెజబ్బుల ముప్పు సైతం తగ్గుతున్నదన్నమాట.

# లివ్ ఇన్ రిలేషన్ షిప్ లో ఉంటే కుటుంబ హోదా..

హైదరాబాద్, : లివ్ ఇన్ రిలేషన్ షిప్‌లో ఉండే వారి పట్ల కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం సెన్సస్ నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. దేశవ్యాప్తంగా జనగణన ? 2027 ప్రక్రియ ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభవుతుంది. అయితే, ఈ జనగణనలో సహజీవన జంటలకు సైతం కుటంబ హోదా ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. చాలాకాలంగా కలిసి ఉంటున్న వారిని ఇకపై ఒకే కుటుంబంగా గుర్తించాలని నిర్ణయం తీసుకున్నట్లు తాజాగా కేంద్రం వెల్లడించింది.మన దేశంలో సాధారణంగా పదేళ్లకోసారి జనగణన నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణనకు ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం జనాభా గణన ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతుంది. రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటి దశలో భాగంగా గృహ గణన చేపట్టనున్నారు. మొబైల్ యాప్ ద్వారా అధికారులు ఇంటింటికీ వెళ్లి ఇళ్ల వివరాలు సేకరించనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో రెండో దశలో జనాభా లెక్కల సేకరణ ఉంటుంది. జనగణన కోసం 33 ప్రశ్నలతో ఓ ప్రశ్నావళిని రూపొందించారు. రెండో దశలో లడఖ్ కేంద్ర పాలిత, జమ్మూకాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మంచుతో కప్పబడిన ప్రాంతాలు, అలాగే హించల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు మినహా భారతదేశం వ్యార్తంగా జనాభా గణన ప్రారంభమవుతుంది. ఈ రెండు రాష్ట్రాల్లో ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో నిర్వహిస్తారురెండవ దశలో కుటుంబంలో వ్యక్తుల సంఖ్య, వారి పేర్లు, వయస్సు, లింగం, వైవాహిక స్థితి, కులం, మతం, విద్య, భాష, వైకల్యం, వలస, వృత్తి, సంతానోత్పత్తి (వివాహిత మహిళల విషయంలో) వివరాలు సేకరిస్తారు. అదేవిధంగా ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు, గృహోపకరణాలు వంటి వివరాలను అడుగుతారు. తృణ ధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వాడకం, వంటగది సౌకర్యాలు, పంటకు వినియోగించే ఇంధనం వివరాలు సేకరిస్తారు.

# తమిళనాడులో మనీ కూపన్ల మాయాజాలం

చెన్నై, : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కురుక్షేత్రంలో 'మేనిఫెస్టో'ల యుద్ధం తారస్థాయికి చేరింది. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ విడుదల చేసిన డీఎంకే మేనిఫెస్టో, ప్రత్యర్థుల ఎత్తుగడలకు ఏమాత్రం తలొగ్గకుండా తన ద్రవిడ మోడల్ నమ్మకాన్నే ప్రతిఫలించింది. అన్నాడీఎంకే ఉచితాల వర్షం కురిపించినా, విజయ్ తన టీవీకే ద్వారా కొత్త ఆశలు రేపినా.. స్టాలిన్ మాత్రం తనదైన శైలిలో, అదనపు ఆకర్షణల కంటే ఆచరణాత్మక పాలనకే మొగ్గు చూపారుడీఎంకే మేనిఫెస్టోను సూపర్ స్టార్ గా అభివర్ణించిన స్టాలిన్, ప్రత్యర్థుల ఉచితాలకు దీటుగా తనదైన శైలిలో ఇల్లత్తరసి అనే పథకాన్ని ప్రకటించారు ఆదాయ పన్ను పరిధిలోకి రాని గృహిణులకు ఏకంగా రూ.8,000 విలువైన కూపన్ అందజేస్తామని, దీనితో వారికి నచ్చిన వాషింగ్ మెషీన్, టీవీ లేదా ఫ్రిజ్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేసుకోవచ్చని వెల్లడించారు. అలాగే కలైంజ్ఞర్ మహిళా హక్కు పథకం కింద ఇస్తున్న నగదును ?1,000 నుండి 2,000కు పెంచుతున్నట్లు ప్రకటించారు. ప్రత్యర్థి పార్టీలు తన పాత పథకాలనే ప్రాతిపదికగా తీసుకుని పోటీ పడుతుండటంతో, తాను పెద్దగా పంథా మార్చుకోవాల్సిన అవసరం లేదని స్టాలిన్ బలంగా నమ్ముతున్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తన మేనిఫెస్టోలో ఉచిత రిఫ్రిజిరేటర్లు, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు రూ.2,000 చొప్పున ఆర్థిక సాయం వంటి భారీ హామీలు గుప్పించారు. అయితే, స్టాలిన్ దీనికి భిన్నంగా ఎంపిక చేసుకునే అవకాశాన్ని లబ్ధిదారులకే వదిలేశారు. ప్రభుత్వం నేరుగా వస్తువులు ఇచ్చే కంటే, ప్రజలే తమకు నచ్చిన వస్తువును కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించడం ద్వారా అవినీతికి తావులేకుండా చేయవచ్చని స్టాలిన్ భావిస్తున్నారు. అన్నాడీఎంకే ఉచితాల హోరును చూసి ఆయన ఏమాత్రం ఆందోళన చెందకుండా, తన పాత పథకాలనే స్కేల్-అప్ చేయడం ఆయన ధీమాకు నిదర్శనం.సినీ నటుడు విజయ్ తన తమిళగ వెట్రి కళగం మేనిఫెస్టోలో నిరుద్యోగ భృతి , డ్రగ్-ఫ్రీ స్టేట్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. కొత్త ఓటర్లు, యువతను ఆకట్టుకోవడమే లక్ష్యంగా విజయ్ అడుగులు వేస్తుంటే, స్టాలిన్ మాత్రం నాన్ ముదల్వన్ పథకం ద్వారా ఇప్పటికే 5 లక్షల మంది యువతకు శిక్షణ, నెలకు 1,500 స్టైపెండ్ ఇస్తున్నామని గుర్తు చేస్తున్నారు. కొత్త పార్టీల రాకతో ఓట్లు చీలిపోయినా, తన డెలివరీ సిస్టమ్ ( బలంగా ఉండటంతో విజయం తనదేనని స్టాలిన్ ఫిక్స్ అయ్యారు. తమిళనాడు చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేశామని, ప్రజల మద్దతుతో ఏడవసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని స్టాలిన్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యర్థులు తనను అనుకరిస్తున్నారే తప్ప కొత్తగా ఏమీ చేయడం లేదన్నది ఆయన విశ్లేషణ. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్‌లో ఈ మేనిఫెస్టోల యుద్ధం ఎవరిని సింహాసనంపై కూర్చోబెడుతుందో చూడాలి.

# యనమల రిటైర్మెంటేనా..!



కాకినాడ : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో అత్యంత కీలకమైన నేతగా, మేధావిగా, వ్యూహకర్తగా వెలుగొందిన యనమల రామకృష్ణుడు రాజకీయ ప్రస్థానం ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉన్నట్లు కనిపిస్తోంది. నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిన ఆయన, తాజాగా కాకినాడలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను చర్చకు దారితీశాయి. "పదవుల కోసం నేను ఎవరినీ సాయం కోరలేదు.. భగవంతుడు అనుకున్నదే మన జీవితంలో జరుగుతుంది" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు, ఆయన రాజకీయ విశ్రాంతికి సంకేతాలా అనే అనుమానాలను బలపరుస్తు న్నాయి.టీడీపీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు యనమల రామకృష్ణుడు పార్టీలో అగ్రస్థానంలో ఉంటూ వచ్చారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, అసెంబ్లీ స్పీకర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. చంద్రబాబుకు నమ్మిన బంటుగా, పార్టీకి ఆర్థిక, రాజ్యాంగ పరమైన అంశాల్లో దిశానిర్దేశం చేస్తూ వచ్చారు. ఇటీవల ఎమ్మెల్సీగా ఆయన పదవీ కాలం ముగిసే వరకు ఏదో ఒక పదవిలో ఉంటూనే ఉన్నారు. అయితే, ఎమ్మెల్సీ గడువు ముగిసిన తర్వాత పార్టీ అధిష్టానం ఆయనకు తదుపరి ఏ బాధ్యత అప్పగించలేదు.యనమల రామకృష్ణుడు రాజ్యసభకు వెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. ఢిల్లీ స్థాయిలో పార్టీ వాణిని వినిపించేందుకు తనకున్న అనుభవం ఉపయోగపడుతుందని ఆయన భావించారు. కానీ, ప్రస్తుత రాజకీయ సమీకరణాల దృష్ట్యా అధిష్టానం ఆ దిశగా ఆలోచించడం లేదని స్పష్టమవుతోంది. "రాజ్యసభ అడిగితే వచ్చేది కాదు.. మనం అనుకున్నది భగవంతుడు చేయడు" అని యనమల అనడం వెనుక, తనకు పదవి దక్కదని ఆయన ముందే గ్రహించారా అనే చర్చ మొదలైంది. "ఇంకా నాకు పదవి ఇవ్వండి.. నేను పరిగెడతాను అని అడగలేను" అని చెప్పడం ద్వారా ఆయన తన అసహనాన్ని లేదా వైరాగ్యాన్ని ప్రదర్శించినట్లు కనిపిస్తోంది. యనమల రాజకీయ గ్రాఫ్ తగ్గడానికి ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు కూడా కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. కాకినాడ సెజ్ భూములపై ఆయన చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీని ఇరకాటంలో పెట్టాయి. ఇది అధిష్టానానికి కొంత అసంతృప్తి కలిగించిందని సమాచారం. ఇటీవల హైదరాబాద్‌లో ఆయన అల్లుడు ఒక డ్రగ్స్ కేసులో పట్టుబడడం యనమల ప్రతిష్ఠను దెబ్బతీసింది. రాజకీయంగా క్లీన్ ఇమేజ్ ఉన్న ఆయనకు, ఈ ఘటన వ్యక్తిగతంగా, రాజకీయంగా పెద్ద ఎదురుదెబ్బగా మారింది."పార్టీ మనుగడ కోసం శత్రువులకు కూడా సాయం చేశాను" అని యనమల అనడం ద్వారా పార్టీ పట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటూనే, తన సేవలకు తగిన గుర్తింపు లభించలేదనే ఆవేదనను వెలిబుచ్చినట్లు అనిపిస్తోంది. 44 ఏళ్లుగా పార్టీ తనను పోషించిందని చెప్పడం ద్వారా కృతజ్ఞత చాటుకున్నప్పటికీ, భవిష్యత్తులో తనకు ప్రత్యక్ష రాజకీయ పదవులు ఉండకపోవచ్చనే వాస్తవాన్ని ఆయన జీర్ణించుకున్నట్లు తెలుస్తోంది.పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. టీడీపీ ఇప్పుడు యువ రక్తాన్ని ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తోంది. సీనియర్లకు గౌరవప్రదమైన స్థానం కల్పిస్తూనే, క్రియాశీలక పదవుల నుంచి వారిని తప్పించి కొత్త వారికి అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే యనమలకు ఇక 'రాజకీయ విశ్రాంతి' తప్పదని ఆయన సన్నిహితులు సైతం గుసగుసలాడుకుంటున్నారు.మొత్తానికి, కాకినాడ వేదికగా యనమల చేసిన ఈ భావోద్వేగ వ్యాఖ్యలు ఒక సుదీర్ఘ రాజకీయ అధ్యాయం ముగింపునకు నాందిగా కనిపిస్తున్నాయి. అడగకుండానే పదవులను పొందిన యనమల, ఇప్పుడు అడిగినా దక్కని పరిస్థితిని ముందే పసిగట్టి గౌరవప్రదంగా తప్పుకోవడమే మేలని భావిస్తున్నారా? కాలమే సమాధానం చెప్పాలి.

# అదృశ్యమైన మహిళ దారుణ హత్య

## అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

చిత్తూరు: పెద్దపంజాని మండల కేంద్రానికి చెందిన చంద్రమ్మ(35) అనే మహిళ దారుణ హత్యకు గురైంది. చంద్రమ్మ రెండు రోజుల నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి మహిళ కోసం గాలించగా.. పలమనేరు రూరల్ మండలం జగమర్ల అటవీ ప్రాంతంలో చంద్రమ్మ మృతదేహం లభ్యమైంది. నగదు లావాదేవీలు కారణంగా ఈ హత్య జరిగినట్లు బంధువులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా గత కొన్నే ళ్లుగా భర్తకు దూరంగా ఉంటోంది చంద్రమ్మ. పెద్దపంజానిలో టైలరింగ్ పని చేస్తూ చిట్టీల వ్యాపార లావాదేవీలు కొనసాగించేది. చంద్రమ్మ కనబడడం లేదని ఆమె బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణలో ఆమె హత్య విషయం వెలుగులోకి వచ్చింది. చంద్రమ్మ హత్య స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

## ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న మంత్రి కందుల దుర్గేష్

విజయవాడ: మంత్రి గురువారం ఉదయం ఢిల్లీలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్తో భేటీ కానున్నారు. పెండింగ్ లో ఉన్న పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టులపై చర్చించనున్నారు. రూ. 430 కోట్ల విలువైన కేంద్ర పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపై కేంద్రానికి వివరించనున్నారు. రాష్ట్రానికి మరో 9 కొత్త పర్యాటక ప్రాజెక్టులు కావాలని ప్రతిపాదించనుననారు.

స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ , శాస్కి పథకాల కింద ఐకానిక్ పర్యాటక కేంద్రాల అభివృద్ధి , ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ల బలోపేతంపై కేంద్రానికి డీపీఆర్ లు సమర్పిస్తారు. గతంలో కీలకమైన పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టుల ఆమోదం కోసం తీవ్ర ప్రయత్నాలు.. ఈ కొత్త ఆర్థిక సంవత్సరంలో వాటిని సాధించే దిశగా ప్రయత్నాలు ముమ్మరం మంత్రి దుర్గేష్ చేసారు.

ప్రసాద్ స్కీమ్ క్రింద రూ.48.95 కోట్లతో ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని శ్రీ గృహ మల్లేశ్వర స్వామి ఆలయం,రూ.36 కోట్లతో కోరుకొండలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, రూ.120 కోట్లతో వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానాలకి నిధులు కోరనున్నారు

# విమానయానానికి వార్ సెగ..




న్యూఢిల్లీ, : భారతీయ విమానయాన రంగంపై పశ్చిమాసియా సంక్షోభం ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధంతో ఇప్పటికే గల్ఫ్ దేశాలకు దేశీయ విమానయాన సంస్థలు 72 శాతం సర్వీసులను తగ్గించేశాయి. దాదాపు నెల రోజుల క్రితం ఫిబ్రవరి 28న వార్ మొదలవగా.. అప్పట్నుంచి మిడిల్ ఈస్ట్ దేశాలకు విమానాలు నడుపుతున్న భారతీయ సంస్థలు ప్రతి నాల్గింటిలో సుమారు మూడింటిని రద్దు చేశాయి. ఈ నేపథ్యంలో ఈసారి సమ్మర్ లోనూ విమానాల సంఖ్యను తగ్గించేయనున్నాయి. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విడుదల చేసిన తాజా షెడ్యూల్ ప్రకారం.. మార్చి 29 నుంచి అక్టోబర్ 24 వరకు దేశీయంగా వారానికి 23,049 విమానాలే నడవనున్నాయి. గత ఏడాది ఇదే సమయంలో నడిచినవి 25,610గా ఉన్నాయి. దీంతో ఈ ఏడాది 10 శాతం (2,561 విమానాలు) రద్దీ తగ్గనున్నది. ఈ మేరకు డీజీసీఏకు చెందిన ఓ సీనియర్ అధికారి స్పష్టం చేశారు.


ఎందుకీ పరిస్థితి?: ఈ ఏడాది మార్కెట్‌లో అనిశ్చిత పరిస్థితి అధికంగా ఉన్నదని విమానయాన సంస్థల వర్గాలు పీటీఐతో పేర్కొన్నాయి. మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతల నడుమ ఈసారి దుబాయ్ తదితర గల్ఫ్ ప్రాంతాలకు విమాన సర్వీసులు బాగా తగ్గిపోయాయి. అలాగే అమెరికా-ఇజ్రాయెల్ దేశాలకు మద్దతుగా ఉంటున్నాయని పొరుగు దేశాలపై ఇరాన్ దాడులు చేస్తున్నది. దీంతో అక్కడ ముడి చమురు ఉత్పత్తికి బ్రేక్ పడింది. ఇది అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరల్ని ఎగదోస్తుండగా.. విమానాల నిర్వహణ వ్యయం ఒక్కసారిగా పెరిగిపోయింది. ఫలితంగా టిక్కెట్ రేట్లను పెంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇవన్నీ కూడా చాలామంది సమ్మర్ టూర్లను ప్రభావితం చేస్తున్నాయని ఎయిర్‌లైన్స్ ఉద్యోగులు చెప్తున్నారు. ఇందుకు తగ్గట్టే విమాన సర్వీసుల సంఖ్యనూ తగ్గించేందుకు విమానయాన కంపెనీలు నిర్ణయించాయి. వచ్చే నెల ఏప్రిల్ నుంచి రోజూ దాదాపు 2వేల విమానాలను నడుపాలని ఇండిగో భావించింది. అయితే ఇప్పుడు మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతల దృష్ట్యా పునరాలోచనలో పడింది. పెరుగుతున్న ఇంధన ధరలు, పడిపోతున్న రూపాయి మారకం విలువ కూడా విమానయాన రంగంపై ఒత్తిడిని పెంచుతున్నాయి.

ఎయిర్‌లైన్స్‌కు ట్రిపుల్ షాక్: పశ్చిమాసియా సంక్షోభంతో ఎయిర్‌లైన్స్‌కు మూడు రకాలుగా నష్టం వాటిల్లుతున్నది. ఒకటి పెరుగుతున్న ఇంధన ధరలైతే, మరొకటి యుద్ధం కారణంగా ఆయా దేశాలు తమ గగనతలాలను మూసివేయడం, ఇంకొకటి రూపాయి నష్టాలు. పెరిగిన ఇంధన ధరలతో ప్రయాణికులు చార్జీల భారం మోపాల్సి వస్తుండటంతో వ్యాపారం దెబ్బతింటున్నది. అలాగే వివిధ దేశాల్లో గగనతల ఆంక్షలతో ఆయా మార్గాల్లో గమ్యస్థానాలను చేరాలంటే ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తున్నది. ఇక డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలకు పతనమవుతుండటం

## ఈ సమ్మర్‌లో 10% తగ్గనున్న సర్వీసులు

కూడా ఎయిర్‌లైన్స్‌కు మరిన్ని కష్టాలను తెచ్చిపెడుతున్నది. ఎయిర్‌క్రాఫ్ట్ లీజులు, నిర్వహణ వ్యయం, విడిభాగాల కొనుగోలు, విదేశీ సిబ్బంది వేతనాల చెల్లింపులు వంటి డాలర్ ఆధారిత ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయని ఎయిర్‌లైన్స్ లబోదిబోమంటున్నాయిప్పుడు. ఏప్రిల్ నుంచి మొదలు..:పెరుగుతున్న చమురు ధరల ప్రభావం.. ఏప్రిల్ నుంచి విమానయాన ఇంధన (ఏటీఎఫ్) ధరల సవరణల్లో కనిపించవచ్చని భారత పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అంటున్నారు. ఆర్థికపరంగా ఈ సంక్షోభం పూర్తి ప్రభావం మున్ముందు ఉంటుందని ఉద్యోగులనుద్దేశిస్తూ ఎయిర్ ఇండియా సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ చేసిన వ్యాఖ్యలు.. కొలువుల్లో కోతల సందేహాలను రేకెత్తిస్తున్నాయి. మొత్తానికి గల్ఫ్ యుద్ధం దెబ్బకు మరిన్ని విమానాలు రద్దయ్యే వీలు లేకపోలేదన్న అభిప్రాయాలే ఇండస్ట్రీ నుంచి వ్యక్తమవుతుండటం గమనార్హం. గత నెల ఫిబ్రవరి 28 నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన ప్రతి నాలుగు విమానాల్లో మూడింటిని రద్దు చేసిన భారతీయ విమానయాన సంస్థలు. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్ కంపెనీలు దాదాపు 2,400 విమాన సర్వీసులను రద్దు చేసినట్టు అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. నెల రోజుల్లో షెడ్యూల్ ప్రకారం భారత్ నుంచి మిడిల్ ఈస్ట్ దేశాలకు 3,300 విమానాలు నడువాల్సి ఉన్నది. అంటే 72 శాతం క్యాన్సిల్ అయ్యాయన్నమాట. భారత్ నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికుల్లో దాదాపు సగం మంది గల్ఫ్ దేశాలకే. గత ఏడాది ఒక్క యూఏఈకే 1.21 కోట్ల మంది భారత్ నుంచి వెళ్లారు. సౌదీ అరేబియాకు కూడా నిరుడు సుమారు 30 లక్షల మంది భారతీయులు వెళ్లారు. ఒమన్, కువైట్, బహ్రెయిన్, ఖతార్‌లకూ రద్దీ ఎక్కువే. దీంతో దేశీయ విమానయాన సంస్థల అదాయానికి ఈ యుద్ధం గండి కొట్టినట్టే అవుతున్నది. దేశీయ విమానయాన రంగ దిగ్గజం ఇండిగో అంతర్జాతీయ ప్రయాణికుల వాటాలో 35-45 శాతం పశ్చిమాసియా దేశాలదే. ఎయిర్ ఇండియాలో ఇది 30-35 శాతంగా ఉన్నది. మధ్య, చిన్నశ్రేణి విమానయాన సంస్థల విషయానికొస్తే.. స్పైస్‌జెట్ ఆదాయంలో దాదాపు 40 శాతం, ఆకాశ ఎయిర్‌కు సుమారు 80 శాతం విదేశీ ఆదాయం గల్ఫ్ దేశాల నుంచే వస్తున్నది.ఈ సమ్మర్ షెడ్యూల్‌లో విమానాలు నడుపుతున్న సంస్థలివే: ఎయిర్ ఇండియా,ఎయిర్ ఇండియాఎక్స్‌ప్రెస్, ఇండిగో,ఆకాశఎయిర్, స్పైస్‌జె ట్, అలయెన్స్ ఎయిర్, ఫ్లై91 శ్రీ స్టార్ ఎయిర్, ఇండియావన్ ఎయిర్.

# స్టీల్ ప్లాంట్ క్రెడిట్ వార్




విశాఖపట్టణం : అనకాపల్లి జిల్లా నక్కపల్లి రాజయ్యపేట లో ఏర్పాటు కానున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ చుట్టూ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద క్రెడిట్ వార్ నడుస్తోంది. మార్చి 23, 2026న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మెగా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా, దీనిపై మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, దానికి టీడీపీ ఇచ్చిన కౌంటర్లు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయితాడేపల్లిలో అద్దంకి పార్టీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో జగన్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుకు పునాది పడింది తన హయాంలోనే అని స్పష్టం చేశారు. 2022లో దావోస్ పర్యటనలో తాను ఆదిత్య మిట్టల్‌తో చర్చలు జరిపానని, నక్కపల్లితో పాటు పలు ప్రాంతాలను వారికి చూపించామని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందే ఈ ప్లాంట్ ఖరారైందని, ఇప్పుడు చంద్రబాబు దీనిని తన ఖాతాలో వేసుకోవాలని చూడటం క్రెడిట్ చోరీ అని విమర్శించారు. జగన్ వ్యాఖ్యలపై టీడీపీ నేతలు ఘాటుగా స్పందిస్తున్నారు. గతంలో జగన్ ఒక ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ.. ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ ఒడిశాలో వస్తోంది.. బాబు మాత్రం ఏపీకి వస్తుందంటూ జనం చెవిలో పూలు పెడుతున్నారు అని అన్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఒడిశాకు వెళ్తుందన్న ప్లాంట్ ఇప్పుడు ఏపీకి ఎలా వచ్చింది? మీ హయాంలో ఒప్పందం జరిగితే అప్పుడే ఎందుకు శంకుస్థాపన చేయలేదు? అంటూ సోషల్ మీడియా వేదికగా నిలదీస్తున్నారు.సుమారు 1.36 లక్షల కోట్ల పెట్టుబడితో రానున్న ఈ ప్లాంట్, విశాఖ స్టీల్ ప్లాంట్ కంటే పెద్దదని ప్రభుత్వం చెబుతోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. 2028 డిసెంబర్ నాటికి ఉత్పత్తి ప్రారంభం కావచ్చని అధికారులు వెల్లడించారు.ఒకవైపు వైఎస్సార్‌సీపీ మేము తెచ్చిన ప్రాజెక్టును బాబు వాడుకుంటున్నారు అని ప్రచారం చేస్తుంటే, మరోవైపు టీడీపీ జగన్ హయాంలో పరిశ్రమలు పారిపోయాయి.. కూటమి ప్రభుత్వం వల్లే పెట్టుబడులు వస్తున్నాయి అని కౌంటర్ ఇస్తోంది. ఈ క్రెడిట్ వార్ ప్రస్తుతం ఏపీ పాలిటిక్స్‌లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారింది.

# ఇప్ప పువ్వు ఎక్కడ దొరుకుంది? ఎలా సేకరిస్తారు..?



హైదరాబాద్, : తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు వాడివేడిగా సాగుతున్న పీక్ టైమ్‌లో ఇప్ప పువ్వు ప్రస్తావన, సభలో రేపిన దుమారం తెలంగాణ రాజకీయాలను షేక్ చేసింది. అధికార ప్రతిపక్షాల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, క్షమాపణల డిమాండ్‌లతో నిండు సభలో ఇప్ప చేసినరాద్ధాంతం అంతా ఇంతా కాదు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్ప పువ్వు ప్రత్యేకత చాలామందికి తెలియదు. ఇప్ప సారా పేరు వినే ఉంటారు, కొంతమంది ఇప్ప సారా రుచిని ఆస్వాదించి ఉంటారు. కానీ ఇప్ప పువ్వు అంటే కేవలం సారా మాత్రమే కాదు. ఇప్ప పువ్వు అంటే తెలంగాణ గిరిజనుల జీవనాధారం, ఆకలితో కడుపు మాడ్చుకునే అడవి బిడ్డలకు ప్రకృతి ప్రసాదించిన అమృతాహారం. తెలంగాణలోని ములుగు, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లోని గిరిజన తండాలు, దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఇప్ప పువ్వు విరివిగా దొరుకుతుంది. ముఖ్యంగా ఉట్నూరు ఏజెన్సీలో ఇప్ప పువ్వుకు ఉండే క్రేజే వేరు. వేసవి కాలంలో ఇప్ప చెట్ల నుంచి ఇప్ప పువ్వులు రాలుతుంటాయి. అందుకే వేసవిని గిరజనులు ఇప్ప సీజన్‌గా పిలుస్తుంటారు. ఇప్ప చెట్లు చూసేందుకు మర్రి చెట్టు మాదిరి మహా వృక్షాల్లా ఉంటాయి. ప్రతీ కొమ్మకూ ఇప్ప పువ్వులు విరగబడి పూస్తుంటాయి. చెట్టు ఎక్కకుండా నేలపై రాలిన ఇప్ప పువ్వులను మాత్రమే గిరిజనులు ఏరుతుంటారు. రాత్రంతా చెట్ల నుంచి రాలిన ఇప్ప పువ్వులను ఏరేందుకు వందల మంది గిరిజనులు ,భార్య పిల్లలతో కలసి తెల్లవారుజామున 4గంటలకు నిద్రలేచిన వెంటనే ఖాళీ కడుపుతో అడవి లోపలికి వెళతారు. సుమారు 8 నుంచి 10 కిలోమీటర్లు అడవిలోకి వెళితే తప్ప ఇప్ప చెట్లు కనిపించవు. అలా చెట్ల కింద రాలిన పువ్వులను ఏరుకుని , తిరిగి మధ్యాహ్నం 2గంటల సమయానికి ఇంటికి చేరుకున్న తరువాత మాత్రమే భోజనం చేస్తారు. అలా నెలలో 20రోజులపాటు ఇప్ప దొరికితేనే ఆరోజు గిరిజన బిడ్డల కడుపునిండేది.

కిలో ఇప్ప పువ్వు ధర ఎంతంటే..?: ఇప్ప పువ్వును సేకరించిన తరువాత నాలుగు నుంచి ఐదు రోజులపాటు ఎండబెట్టి, ఎండు ద్రాక్ష రంగులోకి మారిన తరువాత బస్తాలలో తొక్కి పెట్టి నిల్వ ఉంచుతారు. అలా ఎండబెట్టిన పువ్వు సంవత్సరంపాటు నిల్వ ఉంటుంది. అడవిలో నిర్వహించే సంతల్లో ఒక్క కిలో ఇప్ప పువ్వు 40 నుంచి 50 రూపాయలకు అమ్ముతుంటారు గిరిజనులు. క్వింటా ఇప్ప పువ్వు 5 నుంచి 6వేల రూపాయలకుపైగా ధర పలుకుతుంది.

ఇప్ప పువ్వు ప్రయోజనాలు ఏంటి? : ఇప్ప పువ్వుతో అనేక ఆరోగ్య ప్రయోజనాలుంటాయంటున్నారు ఆయుర్వేద నిపుణులు. వివిధ ఆయుర్వేద మందుల తయారీలోనూ ఇప్ప పువ్వును ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఇప్ప పువ్వు రసం తీసుకోవడం వల్ల కడుపులో అల్సర్, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు తొలిగిపోతాయి. ఇప్ప పువ్వును నీటిలో మరిగించి, ఆ నీటిని నోటిలో పుక్కిలి పట్టడం వల్ల నోటి పూత తగ్గుతుంది. ఇప్ప పువ్వు ఆయిల్ కీళ్ల నొప్పికి అద్భుతంగా పనిచేస్తుంది. పాలతో కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి మంచి పోషకాలు అందుతాయి. ఇప్ప పువ్వు రసంతో చర్మంపై దద్దుర్లు, దురద తగ్గుతాయి. ఇప్ప పువ్వుతో చేసే లడ్డూ, కుడుములతోపాటు వివిధ రకాల స్వీట్స్, గిరిజన వంటలు రుచిలో అద్భుతంగా ఉండటమే కాదు ఆరోగ్యానికి ఓ వరం.

ఇప్ప సారా తయారీ విధానం, ఆరోగ్యంపై ప్రభావం: అటవీ ప్రాంతాల్లో నిత్యం ఇప్పసారా కాయడం గిరిజన గ్రామాల్లో సర్వసాధారణం. వారం వారం నిర్వహించే గిరిజన సంతల్లో ఇప్ప సారాకు ఉండే ప్రత్యేకతే వేరు. మహానగరాలు, పట్టణాలతోపాటు దూర ప్రాంతాలను నుంచి సైతం ఇప్పసారా తాగేందుకు గిరిజన గ్రామాలకు క్యూ కడుతుంటారు. అంతలా ప్రత్యేకమైన ఇప్పసారా తయారీ విధానం వినూత్నంగా ఉంటుంది. ఎండబెట్టిన ఇప్ప పువ్వులను కడిగి రెండు లేదా మూడు రోజుల పాటు ఓ పాత్రలో నానబెడతారు. ఏ మాత్రం కదలకుండా ఇప్ప నీటిని పులయబెట్టిన తరువాత , ఓ పెద్ద పాత్రలో ఉంచి కట్టెల పొయ్యిపై కుండపైన కుండ పెడతారు. పులయబెట్టిన ఇప్పపువ్వ నీటి ఉంచిన పాత్ర కింద మంటపెడుతూ, ఆ పాత్రపైన మరో ఖాళీ కుండకు మధ్యలో సారా బయటకు వెళ్లేలా పైపు అమరుస్తారు. మట్టిపాత్రపైన మరో నీటి కుండను పెట్టి మంటపెడతారు. పులియబెట్టిన ఇప్ప పువ్వునీరు ఆవిరిగా మారి మధ్య కుండకు ఏర్పాటు చేసిన పైపు ద్వారా బయటకు వస్తుంది. అలా వచ్చే ఇప్పసారాను ఫైనల్ గా మరో పాత్రలోకి సేకరిస్తారు. ఇలా సేకరించిన ఇప్పసారా రుచి అద్భుతంగా ఉంటుంది. ఆరోగ్యంపై ఇప్పసారా చెడు ప్రభావం చూపనప్పటికీ, సారా సేవించడం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కానీ ఇక్కడ ఇప్ప సారా తాగడకుండా గిరిజనులే ఉండలేరు. ఇప్పసారా అంటే వీరి సంస్కృతిలో భాగం.

# వార్ ఎఫెక్ట్.. పీఎన్జీకి పెరుగుతున్న డిమాండ్

హైదరాబాద్: ఇరాన్ ముద్ధం మొదలై మూడూ వారాలు దాటిపోయింది. మనంసిలెండర్ గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకుని వాటి కోసం ఎదురు చూస్తూ.. రెండు వారాలు దాటిపోతోంది. అయినా కొన్ని చోట్ల సిలిండర్లు డెలివరీ అవ్వలేదు. యుద్ధం పుణ్యమా అని ముందు ముందు పరిస్థితి ఎలా ఉండబోతోందో కూడా తెలీడం లేదు. ప్రభుత్వం కూడా నెమ్మదిగా అసలు విషయాన్ని చెబుతోంది. రాబోయే రోజుల్లో సిలెండర్ సరఫరాకు ఇబ్బంది అవుతుందని ప్రజలు ప్రత్యామ్నాయాల వైపు వెళ్లాలంటోంది.. అందులో భాగంగా పైపుల ద్వారా సరఫరా చేసే సహజవాయివు ఉపయోగించాలని సూచిస్తోంది. ఇంతకీ హైదరాబాద్‌లో పైప్ నేచురల్డ్ గ్యాస్ కనెక్షన్ ఎలా పొందాలి... ఈ తరుణంలో సగటు మధ్యతరగతి యజమానికి వచ్చే ప్రధాన సందేహం ఒక్కటే.. "అసలు ఈ పైప్ గ్యాస్ కనెక్షన్ తీసుకోవడం వల్ల మనకేమైనా పైసా ఆదా అవుతుందా? లేక ఉన్న సిలిండరే బెటరా?" భాగ్యనగరంలో ఇప్పుడు అక్కడక్కడా రోడ్ల పక్కన పసుపు రంగు పైపులు కనిపిస్తున్నాయి. ఇళ్ల ముందర మీటర్లు బిగిస్తున్నారు. అవును.. నగరంలో పైప్‌డ్ నేచురల్ గ్యాస్ నెమ్మదిగా విస్తరిస్తోంది. హైదారబాద్‌లో పీఎన్జీ కనెక్షన్లు పొందాలంటే ... ఉన్న ఒకే ఒక్క ఆప్షన్ భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్. ఇది గెయిల్ హెచ్‌పీసీఎల్ సంయుక్త సంస్థ.పైప్‌డ్ గ్యాస్ కనెక్షన్ పొందడానికి ముందు మనం చూసుకోవాలసింది. ఆ ప్రాంతంలో సహజవాయి పైప్‌లైన్లు ఉన్నాయా? లేదా..? అని.. మీ ప్రాంతంలో పైపులైన్ ఉన్నట్లైతే భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్‌లో అప్లై చేయాలి. కనెక్షన్ మొత్తానికి సరిపడా డిపాజిట్ చెల్లిస్తే..ఇన్‌స్టేషన్ పూర్తయ్యాక.. గ్యాస్ కనెక్షన్ యాక్టీవ్ అవుతుంది. మీరు అపార్ట్‌మెంట్‌లో నివసించేట్లైతే.. దానికి ఆ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ పర్మిషన్ కావాలి.

# ఉచిత హామీలతో తడిసి ముద్దవుతున్న ఓటర్లు

చెన్నై, : ఎన్నికల వేళ ఓటర్లను ప్రసంగం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు అనేక తాయిలాలు ప్రకటిస్తూ ఉంటాయి.. అందులోనూ ఉచిత పథకాలకు పుట్టినిల్లు లాంటి తమిళనాడు ఎన్నికలంటే ఉచితాల జోరు మామూలుగా ఉండదు. ఇప్పటికే పదుల సంఖ్యలో ఉచిత పథకాలను అక్కడి ప్రభుత్వాలు గతంలో అమలు చేసే ప్రస్తుత ప్రభుత్వం కూడా అమలు చేస్తూ ఉంది.

2026 అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ పార్టీలు పొత్తుల ఏర్పాటు అంశం పూర్తి కాగానే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత వరాల జల్లులు కురిపిస్తున్నాయి.. అందులో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న అన్నాడిఎంకె బీజేపీతో కలిసి కూటమిగా ఏర్పాటై ఎలాగైనా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని గట్టిగా ప్రయత్నాలు చేస్తోంది. దీంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ప్రకటిస్తోంది. ఇప్పటికే అన్నాడీఎంకే చీఫ్ ఎడపాడి పళనిస్వామి డీఎంకే అమలు చేస్తున్న పలు పథకాలకు కొనసాగింపుగా హామీలను ప్రకటించారు. డిఎంకె ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తుండగా.. అన్నా డీఎంకే అధికారంలోకి వస్తే పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. డీఎంకె ప్రభుత్వం 1200 వృద్ధులకు ఇస్తున్న పెన్షన్ రెండు వేలకు పెంచుతామని అన్నా డిఎంకె హామీ ఇచ్చింది. వేయి రూపాయలుగా ఉన్న మహిళలకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని 2000 చేస్తామని మేనిఫెస్టోలో చేర్చింది. అలాగే.. ఇంటింటికి రూ.10వేలు ఇస్తామని పేర్కొంది.తాజాగా అన్నాడీఎంకే మ్యానిఫెస్టోలో మరికొన్ని ఉచితాలను ప్రకటించింది. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ రిఫ్రిజిరేటర్ ఉచితంగా అందిస్తామని అన్నా డీఎంకే చీఫ్ పళనిస్వామి చెప్పారు. మహిళలు స్కూటీ కొనుగోలు కోసం 25 వేలు సాయం అందిస్తామని చెప్పారు. సొంతిల్లు లేని పేదలకు అమ్మ ఇంటి నిర్మించి ఇవ్వడం కూడా అన్నా డీఎంకే మ్యానిఫెస్టోలో ఉంది.

ఉచిత రేషన్ బియ్యంతో పాటు, కిలో నూనె, కిలో కందిపప్పు ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. అయితే అన్నా డీఎంకే మానిఫెస్టో ఇంతటితో పూర్తి కాలేదట.. మరిన్ని ఉచితాలను త్వరలోనే ప్రకటించనున్నట్లు అన్నా డీఎంకే ముఖ్యనేతలు చెబుతున్నారు. ఇంకా డీఎంకే పూర్తి స్థాయి మానిఫెస్టో ప్రకటించలేదు...

విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ మేనిఫెస్టో కూడా రావాల్సి ఉంది. ఇవన్నీ వచ్చాక అందులో ఎలాంటి ఉచితాలు ఉంటాయి.. ఆ ఉచితలను చూసి అన్నాడీఎంకే ఇంకా ఎలాంటి యాడ్ ఆన్ పథకాలను ప్రకటిస్తుందో చూడాల్సిఉందంటున్నారు.

# మాటలు సరే... చేతలు ఎక్కడా

కడప, : జగన్ మోహన్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో 2024 ఎన్నికల ఓటమి ఒక పెద్ద కుదుపు. అయితే, ఓటమి తర్వాత ఆయన కేడర్‌లో ధైర్యం నింపడానికి, ప్రజల్లోకి వస్తానని పదేపదే చేస్తున్న ప్రకటనలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రేపు మాపు అంటూ కాలం గడుపుతున్న తీరుపై సొంత పార్టీలోనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.2024 జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు వైఎస్ జగన్ చేసిన ప్రకటనలను గమనిస్తే, ఆయన యాక్షన్ ప్లాన్ కేవలం ప్రకటనలకే పరిమితమైందని స్పష్టమవుతోంది. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారి పార్టీ నేతలతో మాట్లాడిన జగన్, "ప్రజల పక్షాన పోరాడతాం, త్వరలోనే జిల్లాల పర్యటనలు చేపడతాను" అని ప్రకటించారు. కానీ ఆ తర్వాత ఆయన పర్యటనలు కేవలం బెంగళూరు ప్యాలెస్‌కు, తాడేపల్లి క్యాంప్ ఆఫీసుకే పరిమితమయ్యాయి. అక్టోబర్ 2024 నుంచి జిల్లాల బాట పడతానని కేడర్ ను కలుస్తానని చెప్పారు. కానీ ఆ దసరా కూడా దాటిపోయింది.దసరా అనంతరం మీడియా ముందుకొచ్చిన జగన్, సంక్రాంతి తర్వాత జిల్లాల పర్యటనలు చేస్తానన్నారు. నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతానన్నారు. వారంలో రెండ్రోజులు పాటు జిల్లాల్లోనే ఉంటానన్నారు. అది కూడా దాటిపోయింది. 2025 ఉగాది తర్వాత క్షేత్రస్థాయి పర్యటనలు ఉంటాయని, బస్సు యాత్ర చేసే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. కానీ అది కూడా దాటిపోయింది. ఇప్పటికే ఏడాది అయింది. కానీ ఆయన జనంలోకి మాత్రం రాలేదు.ఇప్పుడేమో వచ్చే ఏడాది నుంచి పాదయాత్ర ప్రారంభిస్తానని జగన్ చెప్తున్నారు. అంతేకాదు.. పాదయాత్రలో చంద్రబాబుకు సినిమా చూపిస్తానంటున్నారు. ఇలాంటి ప్రకటనలు కేడర్ లో తాత్కాలిక ఉత్సాహం నింపుతున్నాయి కానీ, ఇలాంటి వాటి వల్ల పార్టీకి కలిగే ప్రయోజనం ఏమీ ఉండదు. గతంలో ఆయన ఇచ్చిన స్టేట్ మెంట్లలో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. దీంతో ఇప్పుడు పాదయాత్ర కూడా స్టేట్ మెంట్ కు పరిమితమైపోయే అవకాశం ఉందనే ఊహాగానాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి.ఇదిగో వచ్చేస్తున్నా, అదిగో వచ్చేస్తున్నా అని చెప్పిన మరుసటి రోజే జగన్ బెంగళూరు వెళ్లిపోతున్నారు. దీంతో కేడర్ కి ఇలాంటి స్టేంట్ మెంట్స్ వినడం అలవాటైపోయింది. వాళ్లు కూడా పెద్దగా పట్టించుకోవడం మానేస్తున్నారు. ఈ సారైనా చెప్పిన మాట మీద నిలబడితే బాగుంటుందని కేడర్ కోరుకుంటోంది. జగనన్న మాట తప్పడు, మడమ తిప్పడు అని కేడర్ చెప్పుకుంటూ ఉంటుంది. కానీ ఇప్పుడు ఆయన చేతలు స్టేట్ మెంట్స్ కే పరిమితం అవుతుండడంతో కేడర్ లోనే అనుమానాలు మొదలవుతున్నాయి.

# పెళ్లిపై ఫరియా అబ్దుల్లా ఇంట్రెస్టింగ్ కామెంట్స్..



ఫరియా అబ్దుల్లా.. 'జాతిరత్నాలు' సినిమాలో చిట్టి పాత్రతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న ఈ టాలెంటెడ్ బ్యూటీ మరోసారి తన వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తన చలాకీతనం, కామెడీ టైమింగ్‌తో టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఫరియా.. తాజాగా ప్రేమ, పెళ్లి, జీవితంపై తన అభిప్రాయాలను పంచుకుని ఆసక్తికర చర్చకు తెరలేపింది. పెళ్లి గురించి మాట్లాడుతూ ఫరియా చాలా భిన్నమైన ఆలోచనలు వ్యక్తం చేసింది. తన దృష్టిలో ప్రేమ, వివాహం రెండూ వేర్వేరు అంశాలని ఆమె చెప్పింది. మనల్ని ఎవరైనా ప్రేమిస్తున్నారనే భావన చాలా అద్భుతంగా ఉంటుంది. జీవితంలో ఒక తోడు ఉండటం కూడా అవసరమే. కానీ పెళ్లి అనేది ఒక మనిషిని పూర్తిగా మార్చే బంధం. ఇప్పుడు యువతలో వివాహంపై ఆసక్తి తగ్గిపోతోంది. రాబోయే రోజుల్లో పెళ్లి అనే మాటకు అర్థమే మారిపోయే అవకాశం ఉంది" అంటూ ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుత ఈ తరం రిలేషన్‌షిప్స్‌ను చూసే విధానం పూర్తిగా మారిపోయిందని ఫరియా అభిప్రాయపడింది. స్వేచ్ఛ, వ్యక్తిగత స్పేస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న యువత.. సంప్రదాయ బంధాలపై అంత ఆసక్తి చూపించడం లేదని ఆమె విశ్లేషించింది. దీంతో ఆమె వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక తన వ్యక్తిగత జీవితంపై కూడా ఫరియా ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఒకవేళ తాను హీరోయిన్ కాలేదంటే.. పెద్ద క్రూయిజ్ షిప్‌లో చెఫ్‌గా పనిచేసేదాన్నని లేదా ఈవెంట్ మేనేజర్‌గా కెరీర్ కొనసాగించేదాన్నని తెలిపింది. ట్రావెలింగ్ అంటే తనకు చాలా ఇష్టమని, ట్రావెల్ వ్లాగర్‌గా కూడా మారే అవకాశం ఉండేదని చెప్పింది. హైదరాబాద్‌కు చెందిన ఫరియా అబ్దుల్లా కేవలం నటి మాత్రమే కాదు.. మంచి డ్యాన్సర్, రచయిత్రి కూడా. హైదరాబాద్‌లోని లయోలా కాలేజీలో మాస్ కమ్యూనికేషన్ చదువుతున్న సమయంలో ఆమె ప్రతిభను దర్శకుడు నాగ్ అశ్విన్ గుర్తించారు. ఆ తర్వాత ఆడిషన్ ద్వారా జాతిరత్నాలు సినిమాలో అవకాశం దక్కించుకుని ఓవర్‌నైట్ స్టార్‌గా మారింది. సోషల్ మీడియాలో వచ్చే రూమర్లను పెద్దగా పట్టించుకోనని, మంచి కథలు, బలమైన పాత్రలే తనకు ముఖ్యమని ఫరియా స్పష్టం చేసింది. పాత్ర చిన్నదైనా.. క్యారెక్టర్ డిజైన్ బాగుంటే నటించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పి తన వృత్తిపట్ల ఉన్న నిబద్ధతను మరోసారి చాటుకుంది.




# హీరోయిన్ దాంపత్య జీవితంలో చీలికలు



**సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విడాకుల ప్రచారం**


బాలీవుడ్ టెలివిజన్ రంగంలో స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకున్న మౌనీ రాయ్ గత కొన్నేళ్లుగా సినీ రంగంలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. టెలివిజన్ సీరియల్స్‌తో కెరీర్ ప్రారంభించిన ఆమె, తర్వాత పలు హిందీ చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా 'గోల్డ్', 'బ్రహ్మాస్త్ర', 'రోమియో అక్బర్ వాల్టర్' చిత్రాలతో మంచి గుర్తింపు దక్కించుకుంది. అయితే ప్రస్తుతం మౌనీ రాయ్ వ్యక్తిగత జీవితం మళ్లీ వార్తల్లో నిలిచింది. ఆమె తన భర్త సూరజ్ నంబియార్‌తో విడాకులు తీసుకోబోతున్నారనే ప్రచారం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వేగంగా వ్యాపిస్తోంది. మౌనీ రాయ్, సూరజ్ నంబియార్‌లు కొంతకాలం ప్రేమలో ఉన్న తర్వాత 2022 జనవరి 27న గోవాలో అంగరంగ వైభవంగా వివాహం చేసుకున్నారు. బెంగాలీ, మలయాళ సంప్రదాయాల ప్రకారం జరిగిన ఈ పెళ్లి అప్పట్లో భారీ చర్చకు దారితీసింది. సినీ ప్రముఖులు, సన్నిహితుల సమక్షంలో జరిగిన ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇటీవల మౌనీ రాయ్, సూరజ్ నంబియార్ ఇద్దరూ సామాజిక మాధ్యమాల్లో ఒకరినొకరు అన్‌ఫాలో చేసినట్లు నెటిజన్లు గుర్తించారు. అంతేకాదు, తమ పెళ్లికి సంబంధించిన ఫోటోలను కూడా ఖాతాల నుంచి తొలగించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా సినీ ప్రముఖుల వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన చిన్న మార్పులే పెద్ద చర్చలకు దారి తీస్తుంటాయి. ఈ నేపథ్యంలో మౌనీ చేసిన ఈ పని అభిమానుల్లో అనుమానాలకు కారణమయ్యాయి. సామాజిక మాధ్యమాల్లో ఈ అంశంపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. "అధికారిక ప్రకటన వచ్చే వరకు నమ్మలేం" అని కొందరు వ్యాఖ్యానిస్తుండగా, "ఇద్దరి మధ్య నిజంగానే ఏదో సమస్య ఉన్నట్టే కనిపిస్తోంది" అంటూ మరికొందరు చర్చిస్తున్నారు. మౌనీ రాయ్ తరచూ తన భర్తతో కలిసి ఉన్న ఫోటోలు, వీడియోలు పంచుకునేది. అలాంటిది ఆమె ఒక్కసారిగా ఆ జ్ఞాపకాలను తొలగించడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇప్పటివరకు మౌనీ రాయ్ లేదా సూరజ్ నంబియార్ ఈ ప్రచారంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో నిజంగానే వారి దాంపత్య జీవితంలో విభేదాలు వచ్చాయా? లేక ఇది కేవలం సామాజిక మాధ్యమాల ఊహాగానమా? అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

# శ్రీనివాస మంగాపురం సెకండ్ సింగిల్ ప్రోమో




మంగళవారం సినిమా హిట్ తరువాత అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తోన్న చిత్రాల్లో శ్రీనివాస మంగాపురం ఒకటి. ఘట్టమనేని వారసుడు జయకృష్ణ హీరోగా పరిచయమవుతోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ రవీనా టాండన్ కుమార్తె రషా తడానీ హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈచిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్,సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాను వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వినీదత్ సమర్పించడం మరింత బజ్ ని క్రియేట్ చేసింది. తాజాగా శ్రీనివాస మంగాపురం నుంచి సెకండ్ సింగిల్ ప్రోమోను మేకర్స్‌రిలీజ్ చేశారు. మంగా మంగా అంటూ సాగే ఈ సాంగ్ ఆద్యంతంఆకట్టు కొంటుంది. తిరుపతిలో జరిగే ప్రేమకథగా శ్రీనివాస మంగాపురం తెరకెక్కుతోంది. కొత్తగా తిరుపతి కొచ్చిన కుర్రోళ్ళనిబ తకనివ్వరా..?అన్నదమ్ములు లేరా మీకు? అంటూ హీరో.. హీరోయిన్ అందాన్ని చూసి మైమరచిపోయి.. ఆమెపై ఉన్న ప్రేమ భావాలను తెలిపుతున్నట్లు లిరిక్స్ వింటుంటే అర్థమవుతోంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ సాంగ్‌కికాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించాడు.ఇక రేవంత్ తనవాయిస్ తో ఈ సాంగ్ ని నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్లాడు. జయకృష్ణ క్యూట్ స్టెప్స్, మాస్ లుక్, రషా అందం, విజువల్స్ అదిరిపోయాయి. ఫుల్ సాంగ్ ను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం త్వరలోనే రిలీజ్ కి సిద్ధమవుతోంది.

# 'వీరభద్రుడు'తో మాస్ కంబ్యాక్‌కు సూర్య రెడీ..



తమిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా చిత్రం 'వీరభద్రుడు' మరో మూడు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళనాడులో ప్రస్తుతం కొనసాగుతున్న రాజకీయ పరిణామాల కారణంగా సినిమా విడుదలపై కొంత సందిగ్ధత నెలకొన్నప్పటికీ, చివరికి మేకర్స్ ముందుగా ప్రకటించిన తేదీకే రిలీజ్ చేయాలని ఫైనల్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో సూర్య అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూర్యతో పాటు ఆయన తమ్ముడు, హీరో కార్తీ కూడా హాజరయ్యారు. తెలుగు మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టే ఈ స్టార్ బ్రదర్స్, టైమ్ తక్కువగా ఉండటంతో ఒకే ఈవెంట్ ద్వారా సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేసే ప్రయత్నం చేశారు. ఇక తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ట్రైలర్‌ను బట్టి చూస్తే ఇది కోర్ట్‌రూమ్ డ్రామా, యాక్షన్, ఎమోషన్స్ కలగలిసిన కథగా కనిపిస్తోంది. రౌడీ లాయర్లను ఉపయోగిస్తూ కోర్టును తన ఆధీనంలో నడిపించే దుర్మార్గుడు బేబీ కృష్ణ పాత్రలో ఆర్జే బాలాజీ కనిపించగా, అమాయక తండ్రి కూతురికి న్యాయం చేస్తానని చెప్పి చివరకు మోసం చేసే వ్యక్తిగా ఆయన పాత్ర నెగటివ్ షేడ్స్‌లో ఉంది. అలాంటి సమయంలో న్యాయం కోసం తిరిగి రంగంలోకి దిగే వీరభద్ర పాత్రలో సూర్య పవర్‌ఫుల్‌గా కనిపించారు. ఒకప్పుడు నల్లకోటు వదిలేసిన ఆయన, అన్యాయాన్ని ఎదిరించేందుకు మళ్లీ కోర్టులో అడుగుపెడతాడు. అయితే ఈసారి కేవలం వాదనలు మాత్రమే కాదు, అవసరమైతే కత్తి పట్టుకుని శత్రువులను ఎదుర్కొనేంత ఆగ్రహంతో ఆయన పాత్రను డిజైన్ చేసినట్లు ట్రైలర్‌లో చూపించారు. కథ పరంగా పెద్దగా కొత్తదనం కనిపించకపోయినా, బాలీవుడ్‌లో వచ్చిన జాలీ ఎల్ఎల్‌బీ తరహా కోర్ట్‌రూమ్ వైబ్‌ను మాస్ ఎలిమెంట్స్‌తో మిక్స్ చేసినట్లు అనిపిస్తోంది. అదే సమయంలో దైవత్వానికి సంబంధించిన అంశాలు కూడా కథలో కీలకంగా ఉండబోతున్నట్లు హింట్ ఇచ్చారు. ట్రైలర్ చివర్లో కనిపించిన తెల్ల మీసాల వృద్ధుడి షాట్ వెనుక ఓ కీలక సస్పెన్స్ దాచినట్లు తెలుస్తోంది.సినిమాకు సంగీతం అందించిన సాయి అభ్యంకర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు ప్రధాన బలం అయింది. హీరోయిన్‌గా త్రిష కృష్ణన్ నటిస్తుండగా, ట్రైలర్‌లో ఆమెను కొన్ని కీలక సన్నివేశాల్లో మాత్రమే చూపించారు. ఇక బాక్సాఫీస్ పరంగా చూస్తే 'వీరభద్రుడు'కు మంచి అవకాశం కనిపిస్తోంది. ఫిబ్రవరి తర్వాత తెలుగులో పెద్ద స్టార్ హీరో కమర్షియల్ సినిమా పెద్దగా రాకపోవడం ఈ చిత్రానికి ప్లస్ అయ్యే అవకాశముంది. ఇటీవల వచ్చిన ఉస్తాద్ భగత్ సింగ్ ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో ట్రేడ్ కూడా కొత్త భారీ సినిమాకోసం ఎదురుచూస్తోంది. ప్రస్తుతం చెప్పుకోదగ్గ పోటీ కూడా లేకపోవడంతో, సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే సూర్యకు తెలుగు రాష్ట్రాల్లో మంచి ఓపెనింగ్స్ రావడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా మాస్ ప్రేక్షకులను టార్గెట్ చేస్తూ రూపొందించిన ఈ చిత్రం సూర్యకు బలమైన కంబ్యాక్ ఇస్తుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.




# రజనీకాంత్ బయోపిక్ రెడీ..



కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీకాంత్ అంటే ఉండే క్రేజ్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పని లేదు. ఆయన వాకింగ్ స్టైల్, డ్యాన్స్‌కే కోట్లాది మంది అభిమానులు ఫిదా అయ్యారు. బస్ కండక్టర్ స్థాయి నుంచి స్టార్‌గా ఎదిగిన ఆయన ప్రయాణం ఇండస్ట్రీలో ఎందరికో స్ఫూర్తి. ఆయన బయోపిక్ సిల్వర్ స్క్రీన్‌పై రానుందంటూ ఎప్పటి నుంచో ప్రచారం సాగుతోంది. తాజాగా దీనిపై ఆయన కుమార్తె ఐశ్వర్య ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.రజనీ కాంత్ బయోపిక్‌పై తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఐశ్వర్య ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ చెప్పారు. తన తండ్రి ఆటో బయోగ్రఫీ వర్క్ ఇప్పటికే ప్రారంభం అయినట్లు తెలిపారు. ఇది రిలీజ్ అయ్యాక వరల్డ్ వైడ్‌గా ఓ సెన్సేషన్ అవుతుందని అన్నారు. దీంతో అభిమానుల్లో ఓ కొత్త ఉత్సాహం నెలకొంది. అయితే, ఈ బయోపిక్‌లో ఎవరెవరు నటిస్తున్నారు? ఎవరు డైరెక్ట్ చేయబోతున్నారు? అనే వివరాలు తెలియాల్సి ఉంది. త్వరలోనే దీనిపై క్లారిటీ వచ్చే ఛాన్స్ ఉంది. ఇండస్ట్రీలో ఏఐ వినియోగం మంచిదే అయినా అది ఎప్పటికైనా కృత్రిమమే అనేది గుర్తించుకోవాలన్నారు ఐశ్వర్య. అధునాతన టెక్నాలజీ సాయంతో 'కోచ్చాడయాన్ (2014)' వంటి విజువల్ వండర్ తెరకెక్కించగలిగామని చెప్పారు. వీలైతే భవిష్యత్తులో అలాంటి మూవీస్ తీయడం తనకు ఇష్టమని అన్నారు.

'3', 'లాల్ సలామ్' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన ఐశ్వర్య... 'విత్ లవ్' అనే మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ మూవీలో 'టూరిస్ట్ ఫ్యామిలీ' డైరెక్టర్ అభిషన్ జీవింత్ హీరోగా నటించగా... మదన్ దర్శకత్వం వహించారు. 'ఛాంపియన్' ఫేం అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించారు. ఫిబ్రవరి 6న సినిమా తెలుగులోనూ రిలీజ్ కానుంది. అటు, రజనీకాంత్ ప్రస్తుతం 'జైలర్ 2'తో బిజీగా ఉండగా జూన్ 12న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌ను సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది.

Pub ished & Owned by Mamidi Somaiah, H.No.3 2 92/27 to 276/506, Rock Town Co ony, B Nagar, Hyd, Rangareddy, Te angana 500068. Printed at E ora Printers, N Nagar, Industria Estate, Uppa , Rangareddy, Te angana. Editor Mamidi Somaiah. Ph No. 9 00933723.RNI No. TE TE . 12/48343